

మహిళల భద్రత కోసం డ్రోన్లతో ప్రత్యేక నిఘా
ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మహిళల భద్రత కోసం పోలీసులు చేపడుతున్న చర్యల్లో భాగంగా డ్రోన్లతో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. బుధవారం మహిళలు వాకింగ్ చేసే కట్టమంచి చెరువు, ఫారెస్టు, పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో డ్రోన్లతో ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళల భద్రతకు పోలీసుశాఖ అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఎలాంటి భయభ్రాంతులకు గురికాకుండా మహిళలు వాకింగ్‌తో పాటు వ్యాయామం చేసుకోవచ్చన్నారు. బహిరంగ ప్రదేశాల్లో, వాకింగ్ చేసే ప్రాంతాల్లో డ్రోన్లతో ఉదయం, సాయంత్రం నిఘాను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి రోజు ఉదయం 5గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కట్టమంచి వాకింగ్ ట్రాక్, పీవీకేఎన్ డిగ్రీ కళాశాల మైదానం, మెసానికల్ మైదానంలో డ్రోన్‌తో నిఘా ఉంచామని చెప్పారు. ఇకపై రోజూ డ్రోన్ల నిఘా ఉంటుందని, ఎక్కడైనా జరగరానిది జరిగితే తక్షణం పోలీసులు అక్కడికి చేరుకుంటారని తెలిపారు.

డీపీటీవో రాము బాధ్యతల స్వీకరణ



చిత్తూరు రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): చిత్తూరు డీపీటీవోగా రాము బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న జగదీష్ బదిలీపై తిరుపతికి వెళ్లారు. ఆయన స్థానంలో అన్నమయ్య జిల్లా డీపీటీవో రాము చిత్తూరుకు వచ్చారు. గతంలో చిత్తూరు సీటీఎంగా కూడా రాము పనిచేశారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు ఆయన్ను పుష్పగుచ్ఛంతో ఆహ్వానించారు.

సమగ్రశిక్షలో బదిలీలకు షెడ్యూల్ విడుదల

చిత్తూరు సెంట్రల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రశిక్షలో బదిలీలకు షెడ్యూల్ విడుదలైంది. సైట్ ఇంజనీర్లు, కేజీబీవీ టీచింగ్, నాన్‌టీచింగ్, మండల విద్యాశాఖ కార్యాలయంలోని సీఆర్‌ఎంటీలు, మండల స్థాయి అకౌంట్స్, ఎంఐఎస్ కోఆర్డినేటర్, డేటాఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్లు, సబార్డినేట్స్, రిక్వెస్టు, మ్యూచువల్ బదిలీలు జరగనున్నాయి. ఈ నెల 19వ తేదీ గురువారం నుంచి 21వరకు దరఖాస్తుల స్వీకరణ, 23న సీనియారిటీ జాబితా, 24న ప్రచురణ, 27 వరకు అభ్యంతరాల స్వీకరణ, పరిశీలన, 28న తుదిజాబితా ప్రచురణ, 30 నుంచి జూలై 2వ తేదీ వరకు కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు జరగనున్నాయి. ఈ మేరకు సమగ్రశిక్ష అధికారులు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

20, 21 తేదీల డీఎస్సీ పరీక్షల మార్పు

చిత్తూరు సెంట్రల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న క్రమంలో ఈనెల 20, 21 తేదీల్లో జరగాల్సిన మెగా డీఎస్సీ పరీక్షల తేదీలను మార్పు చేసినట్లు డీఈవో వరలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు రోజుల్లో పరీక్షలు రాయాల్సిన అభ్యర్థులకు జూలై 1, 2 తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు హాల్‌టికెట్లు ఈనెల 25వ తేదీ ఏపీడీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. యోగా దినోత్సవం ద్వారా పరీక్షలకు హాజరయ్యే వారు ఇబ్బందులు పడకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు డీఈవో ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

డైట్ ప్రిన్సిపాల్‌గా డీఈవో వరలక్ష్మి



వెదురుకుప్పం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కార్వేటినగంలోని జిల్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (డైట్) ప్రిన్సిపాల్‌గా చిత్తూరు డీఈవో వరలక్ష్మికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. డైట్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న వి.శేఖర్ మే నెలాఖరున పదవీ విరమణ చెందడంతో పోస్టు ఖాళీ అయ్యింది. దీంతో చిత్తూరు డీఈవోకు డైట్ ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

మామిడి రైతుకు బాసట

గంగాధరనెల్లూరు మండలంలోని 100 గొల్లపల్లె వద్ద వున్న జైన్‌ఫ్యాక్టరీకి మామిడి పంట అమ్ముకునేందుకు నానా అవస్థలు పడుతున్న రైతులకు ప్రభుత్వ విప్ థామస్ బాసటగా నిలిచారు. సొంత ఖర్చులతో ఫ్యాక్టరీ వద్ద వేచివున్న రైతులతో పాటు మామిడి కాయలు తోలుకొచ్చిన ట్రాక్టర్ డ్రైవర్లకు మధ్యాహ్నంపూట బుధవారం నుంచి భోజన సౌకర్యం కల్పించాలని నిర్ణయించారు.రోడ్డుపక్కన మామిడి కాయలలోడ్‌తో రెండుకిలోమీటర్ల దాకా బారులు తీరిన ట్రాక్టర్ల వద్దకు స్వయంగా వెళ్ళి అక్కడ వేచివున్న సుమారు 300 మంది రైతులకు, డ్రైవర్లకు భోజనం ప్యాకెట్లతో పాటు నీళ్ల బాటిళ్లను థామస్ అందజేశారు. మామిడికాయల సీజన్ పూర్తయ్యేవరకు మామిడికాయల లోడుతో వచ్చే రైతులకు, డ్రైవర్లకు భోజన సౌకర్యం కల్పించాలని ఆయన టీడీపీ నేతలకు సూచించారు.భోజన ఏర్పాట్లలో ఎలాంటి లోటులేకుండా చూడాలన్నారు

– గంగాధరనెల్లూరు, ఆంధ్రజ్యోతి



రైతులకు భోజనం ప్యాకెట్లను అందజేస్తున్న థామస్

కానరాని నైరుతి చినుకు



చిత్తూరు కలెక్టరేట్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విచిత్రమైన వాతావరణం నెలకొంది. వాతావరణం చల్లగా ఉంటున్నా, మబ్బులు కమ్ముకుంటున్నా నైరుతి చినుకులు కురవడం గగనంగా మారింది. ఎండలు మండిపోయిన మార్చి, ఏప్రిల్ నెలల్లో జిల్లావ్యాప్తంగా 16.4 మిమీ సాధారణ వర్షపాతం బదులు 40.4 మి.మీ, మేనెలలో సాధారణ వర్షపాతం 4.5 మిమీ బదులు 158.5 మి.మీ వర్షం కురిసింది. ఎండాకాలంలో వానాకాలంలా వాతావరణం నెలకొనగా, వానాకాలం ప్రారంభమై మూడోవారం ప్రారంభమైనా ఇప్పటికీ వేసవి కాలాన్నే తలపిస్తోంది. తీవ్ర వర్షాభావం నెలకొంది. చినుకు రాలకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 31 మండలాల్లో జూన్ నెల సాధారణ వర్షపాతం 80.9 మిమీ కాగా, మంగళవారం నాటికి 33.3 మిమీ మాత్రమే కురిసింది. వానలు దంచేస్తాయి అనుకుని కలలు కన్న రైతాంగం దిగాలు పడుతోంది. అక్కడక్కడా బొటాబొటి చినుకులు తప్ప పంటలకు అనువుగా వర్షాలు కురవడం లేదు. యాదమరి, నింద్ర మండలాల్లో మాత్రమే సాధారణానికి మించి అధిక వర్షపాతం నమోదుకాగా, ఒక్క మండలంలో సాధారణం, 10 మండలాల్లో లోటు, 18 మండలాల్లో అత్యధిక లోటు వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ పేర్కొంది. అత్యధిక లోటు వర్షపాతం నమోదైన మండలాల్లో రొంపిచెర్ల, పులిచెర్ల, వెదురుకుప్పం, పూతలపట్టు, ఐరాల, సోమల, చౌడేపల్లి, పుంగనూరు, పెద్దపంజాణి, గంగవరం, తవణంపల్లి, పలమనేరు, బైరెడ్డిపల్లి, వి.కోట, శాంతిపురం, బంగారుపాళ్యం, కుప్పం, రామకుప్పం ఉన్నాయి. ఈ నెలలో రామకుప్పం మండలంలో 69.6 మిమీ వర్షం బదులు చుక్క వాన కూడా కురవకపోవడం విచిత్రం. బంగారుపాళ్యంలో 74.1 మి.మీ బదులు ఇంతవరకు 2.6 మిమీ, చౌడేపల్లిలో 91.1 మిమీ బదులు 4 మిమీ, పలమనేరులో 80.1 బదులు 4 మిమీ వర్షం కురవడం రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది.

శిరీషకు రూ.5 లక్షల చెక్కు పంపిణీ

50 సెంట్ల భూమి ఇస్తామని హామీ



శిరీష పిల్లలకు చెక్కు అందజేస్తున్న పీఎస్‌ఎం, కడా పీడీ వికాస్ మర్మత్ తదితరులు

కుప్పం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం నారాయణపురంలో అప్పు వసూలుకోసం చెట్టుకు కట్టేసి వేధించిన సంఘటనలో బాధితురాలు శిరీషకు బుధవారం కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, కడా సలహా మండలి సభ్యుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు రూ.5 లక్షల విలువ చేసే చెక్కును ప్రభుత్వం తరఫున పంపిణీ చేశారు. నారాయణపురం గ్రామానికి చెందిన తిమ్మరాయప్ప అప్పులు చేసి పారిపోగా, ఆయన భార్య శిరీష బెంగళూరులో దొరికిన పని చేసుకుంటూ ముగ్గురు బిడ్డలను పోషించుకుంటోంది. ఈ క్రమంలో సోమవారం కుమారుడు అబి టీసీకోసం నారాయణపురం వచ్చిన శిరీషను, ఆమెకు రూ.80 వేలు అప్పు ఇచ్చిన అదే గ్రామానికి చెందిన మునికన్నప్ప, ఆయన భార్య వెంకటమ్మ, కొడుకు రాజా, కోడలు జగదీశ్వరి చెట్టుకు కట్టేసి అమానుషంగా వేధించిన విషయం తెలిసిందే. ఈ దారుణంపై తీవ్రంగా స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఎస్పీ మణికంఠను ఆదేశించారు. దీంతో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి కోర్టు ముందు హాజరుపరచగా, జడ్జి వారికి 14 రోజులు రిమాండ్ విధించారు. అదే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు శిరీషతో, మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా మాట్లాడి ఆమె కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. రూ.5 లక్షలు తక్షణ ఆర్థిక సాయంగా ప్రకటించడమే కాక, పిల్లల చదువుల బాధ్యతను ప్రభుత్వమే చూసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో శిరీషను, ఆమె ముగ్గురు పిల్లలు మధు, దీక్షిత, అభిలను బుధవారం కడా కార్యాలయానికి పిలిపించారు. శిరీషకు జరిగిన అన్యాయంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రభుత్వం తరఫున రూ.5 లక్షల విలువ గల చెక్కును పంపిణీ చేశారు. ఇదిగాక ముఖ్యమంత్రి సూచనల మేరకు 50 సెంట్ల భూమిని శిరీష కుటుంబానికి ప్రభుత్వం తరఫున త్వరలోనే ఇస్తామని చెప్పారు. ప్రభుత్వం తరఫున ముగ్గురు పిల్లల విద్యకు అవసరమైన అన్నిరకాల సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. మళ్లీ ఇటువంటి అమానుష, దారుణ సంఘటనలు జరుగకుండా శిరీషకు, ఆమె కుటుంబానికి పూర్తి పోలీసు రక్షణ కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కుప్పం మున్సిపల్, మండల అధ్యక్షులు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ సభ్యుడు కన్నన్ తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణ కేసులో ఇద్దరికి ఏడాది జైలు



శిక్షపడిన నిందితులు

పూతలపట్టు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఓ డీకేటీ భూమి విషయమై గొడవ పడిన ఇద్దరు వ్యక్తులకు చిత్తూరు న్యాయస్థానం ఏడాది జైలు, జరిమానా విధిస్తూ తీర్పుచెప్పింది. పూతలపట్టు మండలం పి.కొత్తకోట పంచాయతీ, వెంకటేష్‌నగర్‌కు చెందిన కోదండం, నవీన్‌కుమార్ 2019 మార్చి 18వ తేదీన డీకేటీ భూమి విషయమై గొడవ పడ్డారు. ఈ గొడవలో నవీన్‌కుమార్, అజయ్‌కుమార్ ఇద్దరూ కలిసి కోదండంపై దాడిచేసి గాయపరిచారు. దీనిపై కోదండం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పూతలపట్టు పోలీసులు కేసు నమోదుచేసి ఇద్దరినీ రిమాండుకు తరలించారు. ఈ కేసు పూర్వాపరాలను బుధవారం చిత్తూరులోని రెండవ మేజిస్ట్రేట్ కోర్టులో పరిశీలించిన న్యాయమూర్తి మాధవి నిందితులకు ఏడాది జైలు, రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసును ఏపీపీ ఉమాదేవి వాదించారు.

శాస్త్రోక్తంగా అక్షరాభ్యాసం





చిన్నారులచేత అక్షరాలు దిద్దిస్తున్న తల్లిదండ్రులు – అక్షరాలు దిద్దిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం అక్షరాభ్యాసం కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయంలోని మేధో గురుదక్షిణామూర్తి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి వేదపండితులు కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లిదండ్రులు పెద్దసంఖ్యలో తమ పిల్లలను ఆలయానికి తీసుకువచ్చి అక్షరాలు దిద్దించారు. ఎమ్మెల్యే సుధీర్ చిన్నారులకు పలక, బలపాలు అందజేసి వారి చేత అక్షరాలు దిద్దించారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, టీడీపీ నాయకులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

– శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

రైతు కడుపుమండింది



గూడూరుపల్లె వద్ద పొలాల పక్కన పడివున్న టమోటాలు

అప్పు చేసి రాత్రీపగలు కష్టపడి పండించిన పంటకు చివరకు కూలీల ఖర్చు కూడా వచ్చే పరిస్థితి లేదనే బాధతో కొంతమంది రైతులు టమోటాలను మార్కెట్‌కు తీసుకెళ్లకుండా పొలాల పక్కనే పడేశారు. పుంగనూరు-చిత్తూరు మార్గంలోని గూడూరుపల్లె సమీపంలో రోడ్డుపక్క టమోటాలను రైతులు ఇలా పడేశారు. ఎకరం టమోటా సాగుచేయాలంటే దాదాపు రూ.3 లక్షలకు పైగా వ్యయం అవుతోంది. అయితే ఈ సీజన్‌లో టమోటాకు గిట్టుబాటు ధర రాక రైతులు నష్టపోయారు.చివరకు టమోటా కోత ఖర్చులు కూడా రావడం లేదన్న బాధతో మార్కెట్‌కు తీసుకెళ్లకుండా ఇలా నేలపాలు చేశారు. బుధవారం పుంగనూరు మార్కెట్‌లో మొదటి రకం టమోటా కిలో రూ.19.40, రెండో రకం రూ.18, మూడో రకం రూ.16.70 పలికింది.

– పుంగనూరు రూరల్, ఆంధ్రజ్యోతి

కుప్పం ఎంఈవో సస్పెన్షన్

కుప్పం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండల విద్యాశాఖాధికారి షేక్ మహబూబ్ బాషాను విధులనుంచి సస్పెండ్ చేస్తూ పాఠశాల విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ శామ్యూల్ మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు విడుదల చేశారు. కుప్పం పల్లార్లపల్లె వద్ద గల హాకింగ్స్ స్కూల్ విషయంలో తాను ఇచ్చిన ఆదేశాలకు విరుద్ధంగా వ్యవహరించినందుకు ఈ క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. హాకింగ్స్ స్కూల్‌లో తమ పిల్లలను కొనసాగించమని తల్లిదండ్రులను ఎంఈవో మహబూబ్ బాషా తప్పుదారి పట్టించారన్నారు. ఈ పాఠశాలకు గుర్తింపు లేదని చెప్పారు. ఆ పాఠశాల సీబీఎస్ఈ గుర్తింపును పొందుతోందని, రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపును ఉపసంహరించుకోవడంపై ఎటువంటి ప్రభావం లేదని, వారి పిల్లలను అదే పాఠశాలలో కొనసాగించమని మహబూబ్ బాషా తల్లిదండ్రుల సమావేశంలో చెప్పినట్లు వీడియో క్లిప్పింగుల ఆధారంగా నిర్ధారించుకున్నట్లు ఆర్జేడీ పేర్కొన్నారు. ఇది తల్లిదండ్రులను తప్పుదారి పట్టించిందన్నారు. శాఖ పట్ల సమగ్రత లేకపోవడం, ఉన్నతాధికారుల పట్ల అవిధేయత, విధి నిర్వహణలో నిర్లక్ష్యం, మండల విద్యాశాఖాధికారి హోదాలో అధికారాలను దుర్వినియోగం చేయడం అనే కారణాలతో ఎంఈవో షేక్ మహబూబ్ బాషాను తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. క్రమశిక్షణా చర్యలు ముగిసే వరకూ ఆయన సస్పెన్షన్‌లో కొనసాగుతారని తెలిపారు. కాగా గుడుపల్లె ఎంఈవో కె.శ్రీదేవికి, కుప్పం ఇన్‌చార్జి ఎంఈవోగా పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ ఆర్జేడీ మంగళవారం తాజా ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్ఆర్ పురం ఎంఈవోపై చీటింగ్ కేసు

గుడిపాల, జూన్ 18(ఆంధ్రజ్యోతి):శ్రీరంగరాజపురం ఎంఈవో సబర్మతిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ బుధవారం తెలిపారు.గుడిపాల మండలం బుచ్చన్నకండ్రిగ గ్రామానికి చెందిన సబర్మతిపై అదే గ్రామానికి చెందిన ప్రియాంక ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రియాంకకు ప్రభుత్వ నర్సుగా ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పిన సబర్మతి రూ.5 లక్షలు ఖర్చవుతుందని చెప్పి ముందుగా రూ.2.50 లక్షలు చెల్లించాలని కోరినట్లు తెలిపారు. దీంతో ఫోన్ పే ద్వారా గత సంవత్సరం రూ.1.55 లక్షలు,నేరుగా రూ.50 వేలు అందించిన ప్రియాంక ఎంతకూ ఉద్యోగం తీసివ్వకపోవడంతో న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించిందన్నారు.దీంతో సబర్మతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అలిపిరి చెక్‌పాయింట్ విస్తరణకు చర్యలు



అధికారులతో సమీక్షిస్తున్న ఈవో శ్యామలరావు

● సమీక్షలో టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుమల, జూన్18(ఆంధ్రజ్యోతి): తిరుమల క్షేత్ర భద్రత, భక్తుల సౌకర్యార్థం దృష్ట్యా అలిపిరి చెక్‌పాయింట్‌ను ఆధునిక సౌకర్యాలతో మరింత విస్తరించేందుకు చర్యలు చేపట్టినట్టు టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో బుధవారం ఆయన అదనపు ఈవో వెంకయ్య చౌదరి, వివిధ విభాగాల అధికారులతో సమీక్షించారు. తొలుత అలిపిరి చెక్‌పాయింట్ వద్ద ఆధునిక సౌకర్యాలు, పటిష్ట భద్రత తదితర అంశాలపై రాక్సా సంస్థ (జీఎంఆర్ గ్రూప్) పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చింది. తనిఖీలు, లగేజీ స్కానింగ్‌కు సమయం, సమస్యలపై అధికారులతో చర్చించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా మరింత వేగంగా వాహనాలు, లగేజీ స్కానింగ్ చేసేందుకు చర్యలు చేపట్టాలని రాక్సా సంస్థ ప్రతినిధులకు ఈవో సూచించారు. చెక్‌పాయింట్ వద్ద తనిఖీ సమయాన్ని తగ్గించేందుకు మార్గాలను సూచించాలన్నారు. టీటీడీ విజిలెన్స్ విభాగం లగేజీ స్కానింగ్‌లో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న రెండు దశాబ్దాల్లో భక్తుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని భద్రతాంశాలపై ప్రతిపాదించాలని రాక్సా ప్రతినిధులను కోరారు. ఆధునిక స్కానర్ల ఏర్పాటు, స్కానర్ల సంఖ్య పెంపుపై దృష్టి సారించాలన్నారు. ఎయిర్‌పోర్టు తరహాలో లగేజీ కన్వేయర్ బెల్ట్‌ల పొడవును పెంచి సమయాన్ని నివారించే అంశం పరిశీలించాలన్నారు. మరింత మంది భద్రతా సిబ్బందిని నియమించి తనిఖీలను సులభతరం చేయాలని సూచించారు. రాక్సా సీఈవో అమిత్ దార్, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, సీఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 6 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

● సోమవారం హుండీ ఆదాయం: రూ.4.12 కోట్లు
● మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 81,037
● తలనీలాలు సమర్పించినవారు: 30,548



సాగులో యాంత్రీకరణకు ప్రోత్సాహం

● కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడి

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ఆదుకుంటోందని, సాగులో యాంత్రీకరణను ప్రోత్సహిస్తూ యంత్ర పరికరాలు, డ్రోన్లను రాయితీతో అందిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం 1,678 మంది చిన్న, సన్నకారు రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలకు సంబంధించి రాయితీ సొమ్ము రూ2,67,26,984 మెగా చెక్కును వ్యవసాయ అధికారి ప్రసాద్‌తో కలిసి పంపిణీ చేశారు. అనంతరం రైతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే రైతులకు సుమారు రూ.6కోట్ల విలువ గల వ్యవసాయ యంత్ర పరికరాలను అందించినట్లు తెలిపారు. అందులో రాయితీ కింద రూ.2,67,26,984 రైతులకు అందిస్తున్నామన్నారు. ఏ సీజన్‌లో ఎలాంటి పంటలు వేయాలనే విషయం తెలుసుకుని తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే పంటలను పండించాలన్నారు. రసాయనిక ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను పెంచాలని సూచించారు. రైతులు పంటల బీమా చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ప్రసాద్‌రావు, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు మెగా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

అన్నదాతకు వెన్నుదన్ను

● ఖరీఫ్‌కు ముందే.. గత నెలలో రాయితీతో పరికరాల పంపిణీ



సూళ్ళూరుపేటలో గతనెలలో రాయితీతో పరికరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 18(ఆంధ్రజ్యోతి): మొత్తం వ్యవసాయ పరికరాలు 1678. వీటి విలువ మొత్తం రూ.5.96 కోట్లు. అందులో రాయితీ మొత్తం 2,67,26,984 రూపాయలు. ఇలా కూటమి ప్రభుత్వం ఈ ఏడాదిలో రైతులకు రాయితీతో యంత్రాలు అందించి వెన్నుదన్నుగా నిలిచింది. వ్యవసాయం పాతపద్ధతిలో చేస్తే లాభం లేదు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి చేస్తేనే రైతు లాభాలబాట పడతాడు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి పదేపదే చెబుతారు. ఆయన 2014-19లో కూడా ఈ దృష్టితోనే అవసరమైన పరికరాలను సబ్సిడీపై అందించారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిని తేలిగ్గా తీసుకుంది. గ్రూపులుగా ఏర్పడితేనే అందజేసేది. అదీ మొక్కుబడిగా ఇచ్చింది. గతేడాది కూటమి ప్రభుత్వం రావడంతో వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రైతులకు వ్యక్తిగతంగానూ యంత్ర పరికరాలను రాయితీపై అందిస్తోంది. జిల్లాకు కేటాయించిన 1,678 పరికరాలను ఖరీఫ్‌కు ముందే గతనెల మొదటి వారంలోనే పంపిణీ చేసి అన్నదాతకు ఆసరాగా నిలిచింది. ఐదెకరాలలోపు ఉండి దరఖాస్తు చేసుకున్న సన్న, చిన్నకారు, మహిళా రైతులు 1,678 పరికరాలకు దరఖాస్తు చేసుకోగా.. అందరికీ పంపిణీ చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. రాయితీపై 15 డ్రోన్లు అందించామన్నారు.

పంపిణీ చేసిన పరికరాలివీ

ట్రాక్టరుకు అనుసంధానించే యంత్రాలు	: 899
పవర్ స్ప్రేయర్లు	: 626
బ్యాటరీ స్ప్రేయర్లు	: 66
రొటావేటర్లు	: 57
పవర్ వీడర్లు	: 16
బుష్ కట్టర్లు	: 10
పవర్ టిల్లర్లు	: 4

● క్లిష్ట నేరాలను గుర్తించడం.. అదుపు చేయడంలో

తిరుపతి పోలీసులు భేష్

● సీసీ కెమెరాలుంటే నేరస్థుల్లో భయం ● 123 సీసీ కెమెరాల ప్రారంభోత్సవంలో కలెక్టర్

తిరుపతి(నేరవిభాగం), జూన్ 18 (ఆంధ్రజ్యోతి): 'తిరుపతి జనాభా దాదాపు 4.5 లక్షలు. రోజూ మరో 1.5 లక్షల మంది తిరుమలకు వచ్చి వెళుతుంటారు. ఇలాంటి చోట నేరాలు చేయడం చాలా సులభం. అదే సమయంలో నేరాల నియంత్రణ.. నేరాలు జరగకుండా చూడడం పోలీసులకు సవాల్ వంటిది. ఈ విషయంలో పోలీసుల పనితీరు అభినందనీయం' అని కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా పోలీసు శాఖ, ఫ్రీడం ఆయిల్ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతి నగరం జీవకోనలో ఏర్పాటు చేసిన 123 సీసీ కెమెరాలను బుధవారం ఓ హోటల్‌లో కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. నగరంలోనే అత్యంత సమస్యాత్మక ప్రాంతంలో ఏక కాలంలో 123 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. దీంతో ఇక్కడ నేరాలు చేయాలన్నా ఒకటికి రెండు సార్లు ఆలోచించి భయపడే పరిస్థితిని పోలీసు శాఖ తీసుకొచ్చిందన్నారు. ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా రియల్ టైం పోలీసు వ్యవస్థతో నేరాల దర్యాప్తుతో పాటు నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఇప్పటికే ఎస్పీ హర్షవర్ధన రాజు విజ్ఞప్తితో డ్రోన్ల కొనుగోలు, సోలార్ సీసీ కెమెరాల ఏర్పాటుకు దాదాపు రూ.30 లక్షలు విడుదల చేసినట్లు గుర్తుచేశారు. ఇంకా అవసరమైతే తామిద్దరం టీమ్ వర్క్ చేసి తిరుపతిలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాలను అదుపు చేయడం, ప్రజలకు అవసరమైన పోలీసు సేవలు అందించడంలో ముందుంటామని భరోసా ఇచ్చారు. జిల్లా అంతటా సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరిస్తామన్నారు. 'జీవకోనలో 40 లొకేషన్లు, అన్ని దారులు, ప్రధాన కూడళ్లలో ఏమి జరిగినా క్షణాల్లో కమాండ్ కంట్రోలు యూనిట్ ద్వారా తెలిసిపోతుంది. వాహనాల రాక పోకలు సాగించే సమయంలో వాహనాల రిజిస్ట్రేషన్ నెంబర్లు సీసీ కెమెరాల్లో నమోదవుతాయి. పోలీసు శాఖకు కలెక్టర్ అందిస్తున్న సహకారం మరవలేనిది' అని ఎస్పీ హర్షవర్ధనరాజు అన్నారు. నాలుగు నెలల్లోనే 123 సీసీ కెమెరాల ఏర్పాటుకు ఫ్రీడం ఆయిల్ జాతీయ స్థాయి సేల్స్ వైస్ ప్రెసిడెంట్, మార్కెటింగ్ మేనేజర్ చంద్రశేఖరరెడ్డి చేసిన కృషి అభినందనీయమన్నారు. తమ కంపెనీ సామాజిక దృక్పథంతో మహిళలకు భద్రత, భరోసా కల్పించే విషయంలో ముందుంటుందని చంద్రశేఖర రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు అయ్యప్ప, అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి, డీఎస్పీలు భక్తవత్సలం, శ్యాంసుందర్, రామకృష్ణమాచ్చారి, సీఐలు, ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు. అనంతరం జీవకోనలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును ఎస్పీ పరిశీలించారు.



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న కలెక్టర్



యోగా ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ, కమిషనర్, ఇతర అధికారులు

21న తారకరామ స్టేడియంలో

10వేల మందితో యోగా

తిరుపతి(కలెక్టరేట్/క్రీడలు), జూన్ 18(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21న తిరుపతిలోని తారకరామ స్టేడియంలో 10వేల మందితో యోగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. ఎస్పీ హర్షవర్ధనరాజు, జేసీ శుభం బన్సల్‌తో కలిసి జిల్లా అధికారులతో కలెక్టరేట్ నుంచి బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. యూనివర్శిటీలు, కళాశాలలు, పాఠశాలల నుంచి విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరయ్యేలా చూడాలని ఆయా శాఖల వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ మౌర్య, డీఆర్వో నరసింహులు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. కాగా, బుధవారం సాయంత్రం కమిషనర్ మౌర్యతో కలసి జేసీ శుభం బన్సల్ తారకరామ మైదానంలో పర్యటించారు. ముందురోజే ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్డీవో రామ్మోహన్ రావు, పర్యాటక శాఖ ఆర్డీ రమణప్రసాద్ పాల్గొన్నారు.

మామిడి పంట సేకరణపై రైతులకు సమాచారం ఇస్తున్నాం

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 18(ఆంధ్రజ్యోతి): మామిడిపంట సేకరణకు సంబంధించిన సరైన సమయంలో రైతులకు సమాచారం అందజేస్తున్నట్లు సీఎం చంద్రబాబు దృష్టికి కలెక్టర్ వెంకటేశ్వర్ తీసుకెళ్లారు. రాష్ట్ర సచివాలయం నుంచి బుధవారం వర్చువల్ విధానంలో సీఎం చంద్రబాబునాయుడు పొగాకు, మామిడిపండ్లకు సంబంధించి జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. జిల్లా నుంచి కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ-క్రాప్ డేటా మేరకు 20,500మంది మామిడిపంటలను సాగు చేసిన రైతులు ఉన్నారని అందులో ఏడాదికి 1.45 మెట్రిక్ టన్నులు కాయలు దిగుబడి అవుతోందన్నారు. జిల్లాలో 8 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయని ప్రస్తుతం 15వేల టన్నులు సేకరించామని తెలిపారు. వారం క్రితం కంగారుపడి ముందస్తుగానే పంటను కోతలు కోసేవారిని అయితే అందరికి సబ్సిడీ వర్తిస్తుందని చెప్పడంతో పంట దిగుబడి వచ్చిన తరువాత తెస్తున్నారన్నారు. మామిడి గుజ్జు పరిశ్రమల వద్ద టోకెన్ సిస్టమ్ ఏర్పాటు చేశామని ఇక్కడ అక్కడ అధికారులను పర్యవేక్షణకు నియమించామన్నారు. ప్రతిరోజు సాయంత్రం ప్రాసెసింగ్ యూనిట్ వద్ద ఎంత సరుకు నిల్వ ఉంది ఎంత సేకరిస్తున్నారనే విషయం చెబుతున్నామన్నారు. రైతు వద్ద చివరి మామిడికాయ వరకు సేకరిస్తామని కలెక్టర్ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, జిల్లా ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల భవిష్యత్తే నా లక్ష్యం

● విడుదలై వెళ్తున్న సురేష్‌బాబు



పెనుకొండ టౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి) : 17ఏళ్లకుపైగా జైలు జీవితాన్ని అనుభవించాను. ఇక నుంచి నా కుమారుడు, కుమార్తె భవిష్యత్తే నా లక్ష్యమని విడుదలపై వెళ్తున్న సురేష్‌బాబు అన్నారు. బుధవారం 14ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్నవారిని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 17మంది అర్హులను విడుదల చేశారు. ఈ క్రమంలో పెనుకొండ సబ్‌జైలులో శిక్ష అనుభవిస్తున్న సురేష్‌బాబుకు విముక్తి కలిగింది. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ తాను తమిళనాడు చెన్నైలో ఉండేవాడినని వివాహ అనంతరం తిరుపతిలో ఓ మెడికల్ షాపులో పనిచేస్తూ జీవనం సాగించేవాడినని కుటుంబ కలహాలతో భార్య మృతిచెందడం నాపై వరకట్నం కేసు నమోదుకావడం అప్పట్లో 3నెలలు తిరుపతి జైలులో రిమాండులో ఉన్నాను. అనంతరం కోర్టు విచారణ అనంతరం 2006లో 302-498ఎ సెక్షన్ల కింద శిక్ష ఖరారు చేశారు. అనంతరం కడప జైలులో 10ఏళ్లు, తరువాత సత్‌ప్రవర్తన కలిగి ఉండటంతో పెనుకొండ సబ్‌జైలుకు తరలించారు. అక్కడ ఏడున్నర సంవత్సరాలున్నాను. ప్రస్తుతం కుమారుడు, కుమార్తె ఇంటర్ చదువుతున్నారు. ఏదైనా పనిచేసుకుని పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుకుంటాను. 17మంది విడుదలైన జాబితాలో నా పేరు ఖరారు చేయడం ఆనందంగా ఉంది. ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

జో.. లాలీ.. జో

● అమ్మ పరీక్షకు వెళ్లింది బజ్జో నాన్నా



చిన్నారిని లాలిస్తున్న తండ్రి

కోట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అమ్మ.. పరీక్షకు వెళ్లింది బజ్జో నాన్న అంటూ చిన్నారులను ఆడిస్తూ కుటుంబీకులు గడిపారు. కోట మండలం విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం డీఎస్సీ పరీక్ష సందర్భంగా ఈ దృశ్యాలు కనిపించాయి. ఉదయం జరిగిన పరీక్షకు 100 మందికి గాను 93 మంది, మధ్యాహ్నం నుంచి జరిగిన పరీక్షకు 97 మంది హాజరయ్యారు. ఈ పరీక్షా కేంద్రానికి నెల్లూరు, తిరుపతి జిల్లాల నుంచి అభ్యర్థులను కేటాయించారు. ఆయా జిల్లాల నుంచి సమయం దొరకదన్న అనుమానంతో ముందుగానే మహిళా అభ్యర్థులు తమ చంటిబిడ్డలను తీసుకుని వచ్చారు. తమ బిడ్డలకు కళాశాల ప్రాంగణంలోని చెట్లకు చీరలను ఉయ్యాలుగా కట్టి తమ తల్లులు, భర్తల పర్యవేక్షణలో ఆడించమని చెప్పి పరీక్షలకు వెళ్లారు. కొంతమంది ఆటోలలో ఉయ్యాలను కట్టి ఆడించగా, మరికొందరు పిల్లలను తమ భర్తలకు అప్పగించారు.



బిడ్డకోసం చెట్టుకు ఉయ్యాల కట్టి..

అప్పులు తీర్చలేక..

తిరుపతిలో రైతు దంపతుల ఆత్మహత్యాయత్నం

● భర్త మృతి, భార్య పరిస్థితి విషమం
● బాధితులది కడప జిల్లా



నాగేంద్రరెడ్డి (ఫైల్ ఫొటో)

తిరుపతి(నేరవిభాగం), జూన్ 18(ఆంధ్రజ్యోతి): వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చలేక రైతు దంపతులు ఆత్మహత్యకు యత్నించారు. కడపజిల్లాకు చెందిన వీరు ఈనెల 10న తిరుపతిలోని ఓ లాడ్జిలో పురుగుల మందు తాగగా, ఆస్పత్రిలో చేర్పించారు. బుధవారం భర్త నాగేంద్రరెడ్డి (35) మృతిచెందగా.. ప్రాణాపాయ స్థితిలో పుష్పవేణి చికిత్స పొందుతున్నారు.దీనికి సంబంధించి ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. కడప జిల్లా సిద్దవటం మండలం డేగనావాండ్లపల్లెకు చెందిన నిమ్మకాయల నాగేంద్ర రెడ్డికి కొంత పొలం ఉంది. వీరికి 8, 6 ఏళ్ల వయసున్న ఇద్దరు కుమార్తెలున్నారు.పంటల సాగుకు లక్షలాది రూపాయలు అప్పులు చేశారు. ఈసారైనా పంట చేతికి రాక పోతుందా? అప్పు తీర్చకపోతామా అన్న భావనతో అధిక వడ్డీలకు అప్పు చేశారు. కానీ, దురదృష్టం వెన్నాడి పెట్టిన పెట్టుబడి కూడా చేతికి రాలేదు. మరోవైపు వడ్డీలతో కలుపుకొని అప్పులు పెరిగిపోయాయి.వీటిని ఎలా తీర్చాలో తెలియక సతమతమయ్యారు. ఈ క్రమంలో భార్యాభర్తలిద్దరూ కలిసి చనిపోవాలని భావించారు. ఇద్దరు కుమార్తెలను ఇంటి వద్ద వదిలి.. తాము తిరుమలకు వెళ్తొస్తామని చెప్పారు. ఈ నెల 9వ తేదీన తిరుపతికి వచ్చిన భార్యాభర్తలు పెద్దకాపులేఅవుట్‌లోని ఓ లాడ్జిలో గది తీసుకున్నారు. ఆ రోజు నవ్వుతూ కలసి మెలసి తిరిగారు. మరుసటి రోజు గదిలోనే పురుగుల మందు తీసుకుని ఆత్మహత్యకు యత్నించారు.ఈ విషయం తెలిసిన వెంటనే ఈస్ట్ పోలీసులకు లాడ్జి మేనేజర్ సమాచారమిచ్చారు.చికిత్స నిమిత్తం వీరిని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పోలీసులు చేర్పించారు. ఇక్కడ చికిత్స పొందుతూ నాగేంద్ర రెడ్డి బుధవారం మృతి చెందారు. పుష్పవేణి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి మునిరెడ్డి ఫిర్యాదు మేరకు ఈస్ట్ సీఐ కేసు నమోదు చేశారు.భార్యాభర్తలు విషం తీసుకోవడం వెనుక ఉన్న బలమైన కారణాలు, ఎవరెవరి వద్ద అప్పులు చేశారు? ఎందుకు చేశారు? డబ్బు కోసం ఎవరైనా వేధింపులకు గురి చేశారా అనే కోణాల్లో విచారిస్తున్నామని సీఐ చెప్పారు.

ప్రాణదానం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



దాత తరఫున అదనపు ఈవోకు చెక్కు అందజేస్తున్న రాఘవేంద్ర

తిరుమల, జూన్18(ఆంధ్రజ్యోతి): టీటీడీ ప్రాణదానం ట్రస్టుకు బుధవారం రూ.10 లక్షలు విరాళంగా అందాయి. హైదరాబాద్‌కు చెందిన అనిదృత్ అనే భక్తుడు ఈ విరాళాన్ని ఇచ్చారు. ఈమేరకు దాత తరఫున ఆయన ప్రతినిధి రాఘవేంద్ర తిరుమలలో అదనపు ఈవో వెంకయ్య చౌదరికి విరాళం చెక్‌ను అందజేశారు.

తిరుపతి జిల్లాలో ముగ్గురిపై ఎలుగుబంట్ల దాడి

● ఒకరికి తీవ్రగాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అంకయ్య

వెంకటగిరి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా వెంకటగిరి మండలం పాలెంకోట సమీపంలోని వెలుగొండ అటవీ ప్రాంతంలో బుధవారం ముగ్గురిపై రెండు ఎలుగుబంట్లు దాడి చేశాయి. ఈ ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. బాధితులు తెలిపిన ప్రకారం.. పాలెంకోటకు చెందిన కటారి అంకయ్య, కావడి మునెయ్య, వెంకటగిరి చెందిన మరొకరు వెదురు కర్రల కోసం వెలుగొండ అడవిలోకి వెళ్లారు. ఈ క్రమంలో రెండు ఎలుగుబంట్లు వీరిపై దాడి చేయడంతో కటారి అంకయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వీళ్లతో పాటు వెళ్లిన కుక్క ఎలుగుబంట్లపై తిరగబడటంతో అవి వెళ్లిపోయాయి. వీరితో పాటు వెళ్లిన మరో వ్యక్తి ఎవరన్నది తెలియలేదు. కాగా, మునెయ్యను అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.

సినీ ఫక్కీలో కత్తిపోట్లు యువకుడి పరిస్థితి విషమం

కోట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నెల్లూరుపల్లి బీసీ కాలనీకి చెందిన శ్రీహరిపై అదే ప్రాంతానికి చెందిన సూర్య సినీ ఫక్కీలో కత్తితో పొడిచి పరారైనట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. శ్రీహరి, సూర్య మధ్య పాత కక్షలున్నాయి. బుధవారం శ్రీహరి తన ఇంటి సమీపంలో వీధిలో నిలబడి ఉండగా స్కూటీపై వచ్చిన సూర్య కత్తితో పొడిచి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన శ్రీహరిని కుటుంబ సభ్యులు నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

సదరన్ డిస్కంలో 15 మందికి కారుణ్య నియామకాలు



నియామక పత్రాలు ఇచ్చిన సీఎండీ కె.సంతోషరావు

తిరుపతి(ఆటోనగర్),జూన్18(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కంలో కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాల సమస్యను బుధవారం సంస్థ సీఎండీ కె.సంతోషరావు పరిష్కరించారు. అర్హులైన 15 మందికి నియామక పత్రాలను అందించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు గురుతర బాధ్యతతో విధులు నిర్వహించాలన్నారు. సంస్థ ఆర్థికాభివృద్ధితో పాటు ప్రాణాలను కూడా కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కె.గురవయ్య, పి.అయూబ్ ఖాన్, సీజీఎం హెచ్‌ఆర్‌డీ జె.రమణాదేవి, జీఎం వై.వెంకటరాజు పాల్గొన్నారు.

రవాణా శాఖ స్పెషల్ డ్రైవ్

● 15 పాఠశాలల బస్సులపై కేసులు
● తనిఖీలు కొనసాగుతాయన్న డీటీవో మురళీమోహన్



బస్సులను తనిఖీ చేస్తున్న ఎంవీఐ అతికానాజ్

తిరుపతి(జీవకోన), జూన్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో రవాణా శాఖ స్కూల్ బస్సులపై స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. జిల్లా రవాణా శాఖ అధికారి మురళీమోహన్ ఆదేశాలతో అధికారులు కరకంబాడీ సర్కిల్, రామానుపల్లి జంక్షన్, రేణిగుంట రోడ్డు, తిరుచానూరు రోడ్డులో నాలుగు బృందాలుగా బుధవారం తనిఖీలు చేశారు. నిబంధనలు పాటించని 15 పాఠశాలల బస్సులపై కేసులు నమోదు చేశారు. ఇందులో పర్మిట్ లేనివి 2, ఫిట్నెస్ సర్టిఫికెట్ లేనివి 4, త్రైమాసిక పన్ను చెల్లించనవి 4, డ్రైవింగ్ లైసెన్స్ లేనిది ఒకటి ఉన్నాయి. వీటికి రూ.2లక్షలు అపరాధ రుసుం విధించారు. అగ్నిమాపక నియంత్రణ పరికరంలేని నాలుగు బస్సులకు జరిమానా విధించి, రసీదులు ఇచ్చారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు వెంకటసుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, అతికానాజ్, మోహన్‌కుమార్, ఆంజనేయప్రసాద్, రమణ నాయక్ పాల్గొన్నారు.

రవాణా శాఖ నిబంధనలు తప్పక పాటించాలి

మోటారు వాహనాల చట్టం 185జి ప్రకారం స్కూలు, కళాశాలల యజమాన్యాలు బస్సుల విషయంలో నిబంధనలు పాటించాలి. విద్యార్థుల భద్రతకు, భవిష్యత్తుకు ఎలాంటి భంగమూ కలగకుండా చూడాలి. ఫిట్నెస్ సర్టిఫికెట్ లేకుండా బస్సులను రోడ్లపై తిప్పరాదు.

- మురళీమోహన్, జిల్లా రవాణాశాఖ అధికారి

మొరాయిస్తున్న యోగాసనాల యాప్



తిరుపతి అర్బన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి):ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో పిల్లలతో ఉదయం మూడు ఆసనాలు చేయించాలని ఆదేశించింది. వాటిని ఫొటోలు తీసి పొందుపరచడానికి ప్రత్యేక యాప్ రూపొందించింది. అయితే ఈ యాప్ మొరాయిస్తుండడంతో గంటల తరబడి పిల్లలు, ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలోనే గడపాల్సి వస్తోంది. జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి యాప్‌లో సాంకేతిక లోపాన్ని పరిష్కరించాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సామాన్య భక్తులకు ఇబ్బందులు రానీయొద్దు

● ఆర్జేసీ చంద్రశేఖర్‌ఆజాద్


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేసీ చంద్రశేఖర్‌ఆజాద్

ఐరాల(కాణిపాకం), జూన్ 18(ఆంధ్రజ్యోతి): కాణిపాక క్షేత్రానికి విచ్చేసే సామాన్య భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని తిరుపతి ఆర్జేసీ చంద్రశేఖర్‌ఆజాద్ అన్నారు. బుధవారం ఆయన కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాణిపాక ఆలయం అనతి కాలంలో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. రోజురోజుకు భక్తుల సంఖ్య పెరుగుతుందని, ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలని ఆలయ అధికారులకు సూచించారు. క్యూలైన్లను పరిశీలించి, ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం ఈవో పెంచలకిషోర్‌తో కలసి అన్నదాన కేంద్రం, లడ్డు పోటు, పడితరం స్టోర్, సీసీ కెమెరాల రూమ్‌ను ఆయన పరిశీలించారు. తర్వాత ఈవో కార్యాలయ సమావేశ భవనంలో జిల్లాలోని వివిధ ఆలయాల ఈవోలతో సమావేశం నిర్వహించి, భక్తులకు ఏర్పాటు చేయాల్సిన మౌలిక వసతుల గురించి చర్చించి తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ఏసీ చిట్టెమ్మ, ఏఈవోలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్ర బాబు, హరిమాధవరెడ్డి, ప్రసాద్, ధనుంజయ, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, జిల్లాలోని పలువురు ఈవోలు పాల్గొన్నారు.

మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి


రైతులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి

పూతలపట్టు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి హామీయిచ్చారు. పూతలపట్టు మండలం వడ్డేపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో నేటివరకు 27 ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా దాదాపు 42వేల టన్నుల తోతాపురి మామిడి సేకరించినట్లు చెప్పారు. తోతాపురి మామిడి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని అన్నారు. పక్వానికి వచ్చిన కాయలను మాత్రమే ప్రాసెసింగ్ యూనిట్లకు తరలించాలన్నారు. మండలాల్లో గ్రామసభల ద్వారా మామిడి అమ్మకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మామిడి రైతులకు సలహాలు, సూచనల కొరకు ప్రాసెసింగ్ యూనిట్ల వద్ద షిఫ్టుల వారీగా ప్రభుత్వ ఉద్యోగులను నియమించామన్నారు. మామిడి రైతుల సందేహాలు, సలహాల కోసం 08572-242777, 94910 77325 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు. అనంతరం గల్లా ఫుడ్స్, గ్లోబల్, నేచురల్ ఫుడ్స్ ఫ్యాక్టరీలను ఆమె తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి, ఏవో మధురవాణి, ఎంపీడీవో నాగరాజు, తహసీల్దార్ రమేష్ బాబు, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఫుడ్‌అండ్‌ఇన్స్ ఫ్యాక్టరీలో ఎస్పీ తనిఖీలు


మామిడి రైతులతో మాట్లాడుతున్న ఎస్పీ

గుడిపాల, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లమడుగు వద్ద ఉన్న ఫుడ్‌అండ్‌ఇన్స్ ఫ్యాక్టరీని చిత్తూరు ఎస్పీ మణికంఠ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీలో భద్రత ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఫ్యాక్టరీ సిబ్బందితో ఆయన మాట్లాడుతూ నిల్వ సామర్థ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ ఫ్యాక్టరీకి ప్రతి ఏట వివిధ ప్రాంతాల నుంచి పెద్ద మొత్తంలో మామిడి కాయలు తీసుకొచ్చి నిల్వ చేసి ప్రాసెసింగ్ చేస్తామని, దీంతో పాటు మామిడి రైతులు బ్రోకర్‌గా పండించిన మామిడి పంటను విక్రయించడానికి తీసుకు వస్తారని ఫ్యాక్టరీ సిబ్బంది తెలిపారు. భద్రతా పరంగా ఫ్యాక్టరీ చుట్టూ ఉన్న గోడ, గేటు, సీసీ కెమెరాలు, నైట్ గార్డుల విధులు తదితర అంశాలపై ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ మామిడి కొనుగోలును పారదర్శకంగా నిర్వహిస్తామని, ఎవరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. ఫ్యాక్టరీ నిల్వ సామర్థ్యాన్ని బట్టి కేటాయించిన సమయంలో రైతులను లోనికి అనుమతిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెస్టు సీఐ శ్రీధర్ నాయుడు, గుడిపాల ఎస్ఐ రామ్మోహన్, ఫుడ్‌అండ్‌ఇన్స్ మేనేజర్ చంద్రశేఖరరెడ్డి, రమేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

'మద్దతు' లేకుంటే కఠిన చర్యలు : కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 18(ఆంధ్రజ్యోతి): తోతాపురి మామిడిపై మద్దతు ధరకన్నా తక్కువ చెల్లించేవారిపై చర్యలు తీసుకుంటామని తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్ హెచ్చరించారు. కలెక్టరేట్ నుంచి బుధవారం గుజ్జు పరిశ్రమ యాజమాన్యం, అధికారులతో ఆయన వర్చువల్‌గా సమీక్షించారు. 'దామలచెరువులోని ట్రేడర్లు రైతులను ఇబ్బందికి గురి చేస్తున్నారని మా దృష్టికి వచ్చింది. మద్దతు ధరకంటే తక్కువ ఇస్తే చర్యలు తీసుకుంటాం. గుజ్జు పరిశ్రమలకు మామిడికాయలను తెచ్చే రైతులకు కనీస సౌకర్యాలు కల్పించాలి. జిల్లాలో మామిడి పంట ఉత్పత్తికన్నా ఎక్కువగా ఉన్న కారణంగా ప్యాకింగ్ మెటీరియల్‌ను సమకూర్చుకుని ప్రాసెసింగ్ యూనిట్ల కెపాసిటీని పెంచుకోవాలి. రైతులకు రావాల్సిన డబ్బును త్వరలో అందించాలి. ధరల విషయంలో ప్రభుత్వ ఉత్తర్వులు అమలయ్యేలా చూడాలి. మండలాల్లో తహసీల్దార్లు, ఉద్యాన అధికారులు మామిడి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి' అని సూచించారు.

35 గంటల వెయిటింగ్

గుజ్జు ఫ్యాక్టరీలకు ట్రాక్టర్లలో మామిడి కాయలు తీసుకెళ్లే రైతులు గంటల కొద్దీ పడిగాపులు కాయాల్సి వస్తోంది. నవ క్వాలిటీ ఫుడ్స్(ఎర్రావారిపాళెం)లో గరిష్ఠంగా 35గంటలు వేచి ఉండాల్సి వస్తోంది. రాసా ఫుడ్స్ (బీఎన్‌కండ్రిగ) గంట.. లియాన్ ఫుడ్స్(పుత్తూరు) 12గంటలు.. టాసా ఫుడ్స్(నారాయణవనం) 24గంటలు.. శ్రీవర్ష ఫుడ్స్(రేణిగుంట) 12గంటలు.. శ్రీదేవరాజుఆగ్రో ఫుడ్స్(కేవీబీపురం) 12గంటలు.. క్యాప్రికాన్(సత్యవేడు) 5గంటలు.. సుప్రీం క్వాలిటీ ఫుడ్స్ (పాకాల) 20 గంటలు వాహనాలు వేచి ఉండే పరిస్థితి ఉందని జిల్లా ఉద్యాన శాఖాధికారి దశరధరామిరెడ్డి తెలిపారు. టోకెన్ సిస్టమ్ పాటిస్తే ఈ పరిస్థితి తప్పుతుందన్నారు. ఇక, బుధవారం గుజ్జు పరిశ్రమలు 2,114.02 టన్నుల కాయలను కొనగా.. మొత్తం 14,507.788 టన్నులకు చేరింది.

నలుగురు జీవిత ఖైదీల విడుదల

కడప క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కడప కేంద్ర కారాగారంలో జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తున్న నలుగురిని విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 17 మందిని విడుదల చేశారు. అందులో నలుగురు కడప సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు ఉన్నారు. సయ్యద్ రవూఫ్ అలియాస్ రాజు (మదనపల్లె), హరిత విజయకుమార్ (కర్నూలు), పాయిని అలియాస్ పలాని(చిత్తూరు), బల్ల వసంతకుమార్ అలియాస్ వసంత (కడప)ను అధికారులు జైలు నుంచి విడుదల చేశారు.

ప్రతిభావంతులకు ఉచిత విద్య

తిరుపతి(విద్య), జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులైన విద్యార్థులకు తమిళనాడు తిరునల్వేలిలోని పీఎస్ఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉచితంగా ఇంజినీరింగ్ చదివే అవకాశం కల్పిస్తున్నట్లు ఆ కళాశాల ప్రతినిధి మారియప్పన్ చెప్పారు. పీఎస్ఎన్ కళాశాల నిర్వహించే ఎంట్రన్స్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన 50 మంది విద్యార్థులకు ఈ అవకాశాన్ని కల్పిస్తామన్నారు. తిరునల్వేలిలో 26 ఏళ్లుగా తమ కళాశాల నడుస్తోందని, ఇక్కడ చదివిన వారు ఉద్యోగాల కోసం ఇబ్బందిపడాల్సిన అవసరం లేదని తెలిపారు. అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ ద్వారా అత్యుతమ బోధన, వసతులు ఉన్నాయని వివరించారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉచిత ప్రవేశాల కోసం కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌ను తిరుపతిలోనూ నిర్వహిస్తామని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు 8341359208లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

కోటపల్లిలో పంటలపై ఏనుగుల గుంపు


ఏనుగుల దాడిలో ధ్వంసమైన మామిడిచెట్టు

కల్లూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. మండలంలోని పాళెం పంచాయతీ కోటపల్లి వద్ద మామిడిచెట్లను ఏనుగుల గుంపు ధ్వంసం చేయడంతో అపారనష్టం వాటిల్లింది. ముందుగా తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని చింతలవంక నుంచి మంగళవారం రాత్రి బయలుదేరిన ఏనుగుల గుంపు కోటపల్లి సమీపానికి చేరుకున్నాయి. గ్రామంలోని రైతు వెంకటమునికి చెందిన 20 మామిడిచెట్లను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. రైతు దామోదర్‌నాయుడుకు చెందిన 5 మామిడిచెట్ల కొమ్మలను విరిచేపి పశుగ్రాసాన్ని తొక్కేశాయి. రైతు వీరభద్రనాయుడుకు చెందిన 5 మామిడిచెట్లు, పనస చెట్టును విరిచేసిన ఏనుగులు బోరు మోటారు, పైపులను ధ్వంసం చేశాయి. రైతు దామోదర్‌కు చెందిన మామిడిచెట్లను ధ్వంసం చేసి డ్రిప్ పైపులను విరిచేశాయి. అనంతరం ఏనుగుల గుంపు అడవిలోకి వెళుతూ మార్గంలోని పలువురు రైతుల మామిడిచెట్లను ధ్వంసం చేసుకుంటూ చేరుకున్నట్లు స్థానికులు తెలిపారు. బుధవారం పగలంతా అడవిలోని చింతలవంక వద్ద ఏనుగులు తిష్ట వేసినట్లు అటవీశాఖ సిబ్బంది తెలిపారు.

రాంపల్లె వద్ద ఏనుగుల సంచారం


రాంపల్లె సమీపంలో ఏనుగులు ధ్వంసం చేసిన మామిడి చెట్లు

సోమల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలోని రాంపల్లె బీట్‌లో మూడు ఏనుగులు పంటలను ధ్వంసం చేశాయి. మంగళవారం రాత్రి రాంపల్లె బాబురెడ్డి మామిడి తోటలో తిరగాడి కాయలను నేలరాల్చాయి. టమోటా పంటను తొక్కేశాయి. గత నెల రోజుల్లో మూడు పర్యాయాలు బాబురెడ్డి తోటలోనే ఏనుగులు తీవ్ర నష్టం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు.

అంగన్వాడీ కార్యకర్తపై దాడి ఘటన హేయం

● వైసీపీ గూండాలకు తగిన గుణపాఠం చెబుతామన్న టీడీపీ నాయకులు


వైసీపీ కో ఆప్షన్ మెంబర్ అక్తర్ దాడిలో గాయపడ్డ నజియా బేగంను పరామర్శిస్తున్న పీఎస్ఎం తదితరులు

కుప్పం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కింది స్థాయినుంచి వైసీపీ అధిష్ఠానం దాకా రాష్ట్రంలో అభివృద్ధిని కూల్చే కుట్రలు పన్నుతోందని టీడీపీ నాయకులు ఆరోపించారు. కుట్రలతో అభివృద్ధిని అడ్డుకోలేరన్నారు. పేట్రేగిపోతున్న వైసీపీ గూండాలకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్ కుమార్, కుప్పం మండల అధ్యక్షుడు ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ నారాయణపురంలో శిరీషపై దాడి అప్పుల విషయంలోనే జరిగినా, వైసీపీ దుష్ప్రచారాలు చేసిందన్నారు. అయితే ఈ ప్రచారాలను ప్రజలెవ్వరూ నమ్మలేదన్నారు. బాధితురాలికి జరిగిన అన్యాయంపై వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమె కుటుంబానికి రూ.5 లక్షలు తక్షణ ఆర్థిక సాయం చేయడంతోపాటు 50 సెంట్ల భూమిని ఇచ్చారని, పిల్లల చదువుకు ప్రభుత్వం ద్వారా సకల సదుపాయాలు కల్పిస్తున్నారని గుర్తు చేశారు. నిందితులను తక్షణం అరెస్టు చేయించి జైలుకు పంపించారన్నారు. కుప్పం మండలం రాగిమానుమిట్టలో అంగన్వాడీ కార్యకర్త నజియా బేగంపై ప్రజా ప్రతినిధి ముసుగులో ఉన్న వైసీపీ రౌడీ షీటర్ అక్తర్, ఆయన సోదరులు కత్తులతో దాడి చేసిన ఘటన హేయమైనదన్నారు. నిజానికి గూండాలుగా రెచ్చిపోయి దాడులు, దౌర్జన్యాలు చేస్తున్నదీ, చేయిస్తున్నదీ వైసీపీ శ్రేణులేనన్న వాస్తవం ఈ ఘటనతో బయపడిందన్నారు. వైసీపీ ఎమ్మెల్సీ భరత్ ఈ దాడులు, దౌర్జన్యాలకు బాధ్యులని, ఆయన వెంటనే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీ అరాచకాలను సాగనివ్వబోమని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏడాది పాలనతో టీడీపీ ఆధ్వర్యంలో ఎన్డీయే ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, అందిస్తున్న సంక్షేమ ఫలాలను ఈనెల 23వ తేదీనుంచి ఇంటింటికీ వెళ్లి విస్తృత ప్రచారం చేస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు సాంబశివం, డాక్టర్ వెంకటేశ్, వీజీ.ప్రతాప్, కాణిపాకం వెంకటేశ్, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

తమిళనాడులోని దోపిడీ కేసులో.. ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ అరెస్ట్


అరుణ్‌కుమార్

తిరుమల/చెన్నై, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో విధులు నిర్వహిస్తున్న ఓ ఎస్పీఎఫ్ కానిస్టేబుల్‌ను తమిళనాడు పోలీసులు అరెస్ట్ చేశారు. వ్యాపారవేత్త భార్యను కొట్టి దోపిడీకి పాల్పడిన కేసులో ఇతడితో పాటు మరో ముగ్గురు అరెస్టయ్యారు. వివరాలిలా ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూరు జిల్లా వాణియంబాడి నీలికొల్లై వీధికి తోళ్లపరిశ్రమ యజమాని ఇంతియాస్ అహ్మద్ ఇంట్లో శక్తివేల్ పని చేస్తున్నాడు. మూడు రోజుల కిందట నలుగురు ఆ ఇంట్లో చొరబడి వ్యాపారవేత్త భార్య సబితా గుల్షంను కట్టేసి దోపిడీకి పాల్పడ్డారు. కేసు దర్యాప్తులో భాగంగా వాణియంబాడి పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించారు. చెన్నైకు చెందిన దోపిడీ ముఠా సభ్యులకు, శక్తివేల్‌కు సంబంధం ఉన్నట్టు గుర్తించారు. శక్తివేల్‌తో పాటు తిరుపతికి చెందిన శాంతకుమారి, కొల్లకట్టై ప్రాంతానికి చెందిన ఇళవరసన్(49) సహా నలుగురికి సంబంధం ఉన్నట్టు గుర్తించారు. శక్తివేల్‌కు.. ఇళవరసన్‌కు పరిచయం ఉండగా.. ఇళవరసన్‌క తిరుపతికి చెందిన శాంతకుమారి బాగా తెలుసు. ఈ ముగ్గురు కలిసి తిరుమలలో పనిచేసే ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ అరుణ్ కుమార్ సాయం కోరారు. అతడి ప్లాన్ ప్రకారం ఆ ముగ్గురు దోపిడీకి పాల్పడ్డారు. దీంతో కానిస్టేబుల్ అరుణ్ కుమార్‌ను తిరుపతి పోలీసుల సహకారంతో అదుపులోకి తీసుకుని వాణియంబాడికి తరలించారు. కాగా, కడపజిల్లాకు చెందిన అరుణ్‌కుమార్ రెండేళ్లుగా అలిపిరి చెక్‌పాయింట్, తిరుమలలోని పలు ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల అలిపిరి నుంచి తిరుమలలో బ్యాగేజీ స్కానింగ్ సెంటర్‌కు మారాడు. ఈఅంశంపై స్థానిక ఎస్పీఎఫ్ అధికారి మాట్లాడేందుకు నిరాకరించారు.

అదనంగా కరెంటు వాడుతున్నారా...

అయితే క్రమబద్ధీకరించుకోండి

● ఈనెల 30న చివరి తేది
● గుర్తిస్తే జరిమానా తప్పదు
● క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ


విద్యుత్ మీటర్లు

చిత్తూరు రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఏటా వేసవిలో అధిక శాతం వినియోగదారులు అదనపు విద్యుత్ లోడ్ సమస్య ఎదుర్కొంటున్నారు. ఇటువంటి ఇబ్బందులు తొలగించేందుకు కూటమి ప్రభుత్వం ముందుకొచ్చింది. గృహ వినియోగదారులకు అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ అందిస్తోంది. స్వచ్ఛందంగా క్రమబద్ధీకరణకు ఈ నెల 30 వరకు అవకాశాన్ని కల్పించారు.

గృహాలకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చే సమయంలో లైట్లు, ఫ్యాన్లు ఇతర గృహోపకరణాల వినియోగాన్ని అంచనా వేసి లోడును కిలోవాట్లలో లెక్కించి సెక్యూరిటీ డిపాజిట్, డెవలప్మెంట్ చార్జీలు కట్టించుకుంటారు. అధిక శాతం మంది దరఖాస్తులో రెండు, మూడు కిలోవాట్లకు అనుమతి తీసుకుంటారు. ఈ లెక్క ప్రకారమే అధికారులు ఆ ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తారు. తర్వాత గృహ యజమానులు ఏసీ, ఫ్రిజ్, వాషింగ్‌మిషన్, గీజర్లు వంటివి ఏర్పాటు చేసుకున్నా అందుకు అనుగుణంగా ఛార్జీలు చెల్లించరు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడు ఎక్కువై తరచూ ట్రిప్ కావడంతో పాటు లో వోల్టేజ్ సమస్యలు వస్తున్నాయి. దీంతో విద్యుత్ శాఖ అధికారులు లో వోల్టేజ్ సమస్య ఉన్న ప్రాంతాల్లో ఇంటింటిని తనిఖీ చేస్తుంటారు. వారు చెల్లించిన సెక్యూరిటీ డిపాజిట్ ఆధారంగా విద్యుత్ వినియోగిస్తున్నారా? లేదా అదనంగా గృహోపకరణాలు వినియోగిస్తున్నారా ? అని తనిఖీలు నిర్వహిస్తారు. అదనపు లోడ్ వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే లోడ్‌ను బట్టి వారికి జరిమానా విధిస్తారు.

సద్వినియోగం చేసుకోండి



విద్యుత్ బిల్లులపై ప్రస్తుతం ఎన్ని కిలోవాట్లకు డిపాజిట్ చెల్లించారో రికార్డు ఉంటుంది. ప్రస్తుతం ఇంటిలో వినియోగిస్తున్న వాటిని లెక్కించి అందుకు అనుగుణంగా డబ్బు చెల్లించాలి. ప్రతి అదనపు కిలోవాట్‌కు సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.200, డెవలప్మెంట్ ఛార్జీగా రూ.2 వేలు నిర్ణయించారు. జూన్ నెలాఖరులోపు అయితే 50 శాతం రాయితీ కింద రూ.వెయ్యి చెల్లిస్తే సరిపోతుంది. దరఖాస్తు ఫీజు రూ.50, మీసేవ, సచివాలయంతో పాటు ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోండి.

- ఇస్మాయిల్ అహ్మద్,ఎస్ఈ

మామిడి రైతుకు మద్దతేదీ?

● తోతాపురి కొనుగోళ్లు రూ.3 వేలకే సాయంత్రం మరింత తగ్గింపు
● రోడ్డు పక్కన పారబోసిన రైతులు


రోడ్డు పక్కన రైతులు పడేసిన తోతాపురి కాయలు

పాకాల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి):మామిడికి మద్దతు ధరపై ప్రభుత్వ ప్రకటనలు, అధికారుల ఆదేశాలను తిరుపతి జిల్లాలో గుజ్జు పరిశ్రమలు, ర్యాంపు యజమానులు, వ్యాపారులు పట్టించుకోవడం లేదు. వీరంతా సిండికేటుగా మారి బుధవారం ర్యాంపుల వద్ద కొనుగోళ్లను ఆపేశారు. దీంతో రైతులు పడిగాపులు గాస్తున్నారు. తోతాపురి టన్ను మద్దతు ధర రూ.8వేలు కాగా.. కనీసం రూ. 6వేలకైనా కొనాలని రైతులు ప్రాధేయపడుతున్నా వ్యాపారులు బేఖాతరు చేస్తున్నారు. చివరకు బుధవారం రూ.3వేలకు ధర పడిపోయింది. చీకటి పడ్డాక కొందరు రూ.1500కే కొనుగోలు చేశారు. మామిడి కోత కూలీ, రవాణాకుగాను టన్నుకు రూ.2500 ఖర్చవుతోందని రైతులు అంటున్నారు. చివరకు ఈ కూలి ఖర్చులూ రాక చేతినుంచి పడుతోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. టన్ను రూ.2వేలకు కూడా కొనుగోలు చేయకపోవడంతో కొందరు కడుపుమండి ట్రాక్టర్లలో తెచ్చిన మామిడి కాయలను రోడ్డు పక్కన పడేసి వెళ్లిపోతున్నారు. ఇక, మరోవైపు గుజ్జు పరిశ్రమలకు ట్రాక్టర్లలో తీసుకెళ్తే అన్‌లోడింగ్‌కు రోజుల తరబడి వేచిచూడాల్సి వస్తోంది. దీంతో ట్రాక్టర్లు దొరకడంకూడా కష్టమవుతోంది. దామలచెరువు పరిసరాల్లోని ర్యాంపుల యజమానులు ఒక్కటై ఇబ్బందులు పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, జగన్మోహన్, మురళీమోహన్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఉద్యాన శాఖ అధికారులు, మ్యాంగోనగర్‌కు వచ్చి వ్యాపారులతో, గుజ్జు పరిశ్రమల యజమానులు, ర్యాంప్ నిర్వాహకులతో చర్చించినా ఫలితం కనిపించలేదు. మామిడి తోటల్లో తోతాపురి కాయలన్నీ పక్వానికి వచ్చి రాలిపోతున్నాయని, త్వరతగతిన కొనుగోళ్లు చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకొని తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా, ఎస్పీ హర్షవర్ధనరాజు బుధవారం దామలచెరువులోని మ్యాంగోనగర్‌కు వచ్చి వ్యాపారులు, సప్లయర్లతో మాట్లాడారు. మద్దతు ధరకు కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథరామిరెడ్డి, మండల ఉద్యాన అధికారి శైలజ బుధవారం మ్యాంగోనగర్‌లో పర్యటించారు. గుజ్జుపరిశ్రమల యజమానులు, ర్యాంప్‌లవద్ద సప్లయర్లు, మండీ వ్యాపారులు తోతాపురి మామిడి కాయలు కొనుగోలు చేసి రైతులకు సహకరించాలని కోరారు. ర్యాంప్‌ల వద్ద టోకెన్లు ఇచ్చి రైతులు ఇబ్బందులు పడకుండా మద్దతు ధరకు కొనాలని లేదంటే చర్యలు తీసుకుంటామన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

యోగాతోనే రోగాలు నయం



యోగా టీచర్‌ను సన్మానిస్తున్న ట్రస్టు చైర్మన్ అయూబ్‌ఖాన్

పుంగనూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): యోగా నేర్చుకోవడంతో రోగాలు దూరమవుతాయిని యోగా టీచర్ వనిత పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు యోగా చేయడంతో కలిగే ప్రయోజనాలు, లాభాలను వివరించారు. విద్యార్థులు రోజూ కనీసం అర్ధ గంట సమయం యోగాకు కేటాయించాలని కోరారు. అనంతరం ఆమెను ఏపీ అబ్దుల్ కలాం ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ పి.ఆయూబ్‌ఖాన్, తదితరులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కడా పీడీ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ డే


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కడా పీడీ

కుప్పం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కడా కార్యాలయంలో బుధవారం కడా పీడీ వికాస్ మర్మత్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. పింఛన్లు, భూమి, ఉద్యోగ, ఆరోగ్య సంబంధిత సమస్యలను ప్రజలు ఆయనకు అర్జీల రూపంలో నివేదించారు. కొన్ని సమస్యలను పీడీ అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్ని సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

శిరీషను అవమానించిన వారిని శిక్షించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా నాయకురాలు భువనేశ్వరి తదితరులు

పలమనేరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : కుప్పం మండలం నారాయణపురంలో ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వలేదని శిరీష అనే మహిళను అమానుషంగా చెట్టుకు కట్టేసి కొట్టిన దోషులను కఠినంగా శిక్షించాలని ప్రజాసంఘాలు డిమాండు చేశాయి. బుధవారం పలమనేరు సీపీఎం కార్యాలయంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో సంఘాల నాయకులు మాట్లాడుతూ కుప్పంలో జరిగిన ఆటవిక చర్యను తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలోనే ఇటువంటి సంఘటన చోటు చేసుకోవడం చాలాబాధాకరమన్నారు. ఇలాంటి సంఘటనలు ఎక్కడా పునరావృతం కాకుండా ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఐద్వా జిల్లా కన్వీనర్ భువనేశ్వరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఓబుల్‌రాజు, కేవీపీఎస్ నాయకుడు అన్నూరు ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కేజేసీ విద్యార్థులకు నీట్‌లో ఉత్తమ ర్యాంకులు



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో శాంతా నాగరాజ్

కుప్పం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): బీసీఎన్ విద్యా సంస్థలకు అనుబంధమైన కుప్పం జూనియర్ కళాశాల విద్యార్థులు నీట్ 2025 పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు కళాశాల చైర్‌పర్సన్ ఎన్.శాంతా నాగరాజ్ తెలిపారు. కేజేసీ విద్యార్థులు ఎం.శంకర్ 548, ఆర్.రంజిత్ 513, ఎస్.అను 489 మార్కులు సాధించి ఎంబీబీఎస్ సీట్లను కైవశం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను శాంతా నాగరాజ్‌తోపాటు ప్రిన్సిపాల్ ఎంటీసుప్రియ, అధ్యాపకులు అభినందించారు.

విత్తనశుద్ధితో మెరుగైన దిగుబడులు సాధ్యం


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

గంగవరం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విత్తనశుద్ధితో మెరుగైన దిగుబడులు సాధ్యమవుతాయని పుంగనూరు వ్యవసాయశాఖ ఏడీఏ శివకుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కూర్నిపల్లె గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. క్షేత్రస్థాయిలో రైతులకు పంటలసాగుపై అవగాహన కల్పించారు. తోతాపురి రకానికి కేజీకి రూ.4 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందని, రైతులు పక్వానికి వచ్చిన కాయలను మార్కెట్‌కు తీసుకురావాలన్నారు. ఏవో రఖీబా, ఆర్‌ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజనీరింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి


ఎమ్మెల్యేకి వినతిపత్రం అందిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

పలమనేరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరుతూ బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ప్రభుత్వ పథకాలన్నీ అమలు చేయాలని, మినిమమ్ స్కేల్ అమలు చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని కలిసి సమస్యలపై వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

పీఈఎస్‌లో అందుబాటులో ఎండో క్రైనాలజీ నిపుణుడు


డాక్టర్ విక్రమ్

కుప్పం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని పీఈఎస్ స్పెషాలిటీ ఆసుపత్రిలో షుగర్, ఎండోక్రైనాలజీ నిపుణుడు డాక్టర్ ఏజీ.విక్రమ్ రోజూ అందుబాటులో ఉంటారని ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది. టైప్ 1, టైప్ 2 మధుమేహం, గర్భధారణ మధుమేహం, పిట్యూటరీ, థైరాయిడ్, అడ్రినల్ రుగ్మతలు, ఇన్సులిన్ పంప్ థెరపీ, అస్టియో పోరోసిస్, కాల్షియం లోపాలు, అధిక రక్తపోటు, హార్మోన్ సమస్యలు తదితర ఆరోగ్య సమస్యలకు అత్యంత మెరుగైన చికిత్స చేస్తారన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ


పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న జాకీర్ తదితరులు

కుప్పం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణంలోని ఆర్ పేట జిల్లా పరిషత్తు ఉర్దూ ఉన్నత పాఠశాలలో టీడీపీ కుప్పం మైనారిటీ సెల్ అధ్యక్షుడు జాకీర్ అహ్మద్, పాఠశాల చైర్మన్ అల్లాబక్షు, కో ఆప్షన్ మెంబర్ ఖాసీంలు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు సకల సదుపాయాల కల్పనకు ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌లు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. బాగా చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్‌సింగ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొండామారిలో గంగమ్మ జాతర

చౌడేపల్లె, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నడివీధి గంగమ్మ జాతరను మండలంలోని పెద్దకొండామారిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ పొలిమేరలోని నలుమూలల్లో ఉన్న గ్రామ దేవతలకు మహిళలు దీపాలు, దివ్వెలు సమర్పించారు.

ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్‌గా ప్రదీప్



రొంపిచెర్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌గా ప్రదీప్ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లా కేవీపల్లె మోడల్ స్కూల్‌లో టీచరుగా, ప్రిన్సిపాల్‌గా 12 సంవత్సరాలు సేవలందించారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా ఉన్న డాక్టర్ సరళ తిరుపతి జిల్లా ఎర్రావారిపాలెంకు బదిలీ అయ్యారు.

ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీ


పలమనేరులో విజయోత్సవ ర్యాలీ

పలమనేరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులో బుధవారం ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఇక్కడి విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. జాతీయ జెండాలను పట్టుకొని నినాదాలు చేశారు.

ఏఐఎస్ఎఫ్ నేతలపై పోలీసుల దాడి దారుణం

పుంగనూరు రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విజయవాడ శ్రీచైతన్య విద్యాసంస్థల ఎదుట ఏఐఎస్ఎఫ్ నేతలు పాఠ్యపుస్తకాల అక్రమ విక్రయాలను వ్యతిరేకిస్తూ శాంతియుత నిరసన చేపట్టగా పోలీసులు దాడి చేయడం దారుణమని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు మున్నా పేర్కొన్నారు. బుధవారం పుంగనూరులో ఆయన మాట్లాడుతూ విద్యావ్యాపారాన్ని విద్యార్థులపై మోపుతుండగా ఆర్థిక భారంపై పోరాటం చేస్తుండగా పోలీసులు అన్యాయంగా దాడి చేశారన్నారు. విద్యను వ్యాపారంగా మార్చే వ్యక్తులను కాపాడుతూ విద్యార్థుల హక్కుల కోసం పోరాడే నాయకులను అణచివేయాలనే ప్రయత్నం జరుగుతోందని మండిపడ్డారు. వెంటనే దాడిపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని.. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం


ఉద్యోగుల సమస్యలపై
ఎమ్మెల్యేను కలిసిన పలమనేరు సంఘ నాయకులు

పలమనేరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : వివిధ శాఖల ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై పలమనేరు ఎన్జీవో సంఘం నిరంతర పోరాటం చేస్తోందని సంఘ అధ్యక్షులు ఆనంద బాబు అన్నారు. బుధవారం తిరుపతికి వచ్చిన ఎన్జీవో సంఘ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆలపర్తి విద్యాసాగర్, బి.వి.రమణలను కలిసి పలు సమస్యలపై చర్చించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎన్జీవో సంఘ ఉపాధ్యక్షులు లక్ష్మీపతి యాదవ్, సచివాలయ ఉద్యోగుల సంఘ అధ్యక్షులు పి.రమణ, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

నేడు చల్లా పుంగనూరు పర్యటన

పుంగనూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో గురువారం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పర్యటిస్తారని టీడీపీ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 11.30 గంటలకు మెప్మా రీసోర్స్ పర్సన్లకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

రహదారులకు కొత్తరూపం..!

● ఆరేళ్ల సమస్యకు పరిష్కారం



రామకుప్పం వైఎస్సార్ సర్కిల్ నుంచి పల్లెకుప్పం వెళ్లే దారి (నెల రోజుల క్రితం) / నేడు రహదారి పరిస్థితి ఇలా...

రామకుప్పం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ పాలనలో రహదారులు మరమ్మతులకు నోచుకోక ప్రజలు అవస్థలకు గురయ్యారు. ముఖ్యంగా గ్రామీణ రహదారులు అధ్వానంగా మారి గ్రామీణ ప్రజలకు రాకపోకలు నరకప్రాయంగా మారింది. రామకుప్పం మండలంలో పలు రహదారులు గుంతలమయంగా మారాయి. రహదారులు బాగు చేయాలన్న జనం వినతులు అరణ్య రోదనలుగా మారాయి. రామకుప్పం వైఎస్సార్ సర్కిల్ నుంచి సర్కిల్ అనుకుని ఉండే మలుపు, కెంపసముద్రం గ్రామం వద్ద గల మలుపులు, అదే సర్కిల్ వద్ద పల్లెకుప్పానికి వెళ్లే రహదారిలో, బందార్లపల్లె నుంచి బగళనత్తంకు వెళ్లే రహదారిలోని ఓ మలుపు వద్ద రహదారి మొత్తం ఛిద్రమై గుంతలమయంగా మారింది. ఆ మలుపుల వద్ద రోడ్డు తగ్గులో ఉండటంతో వర్షం వస్తే గుంతల్లో నీరు చేరి కుంటలను తలపించేవి. దీంతో రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా ఉండేవి. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఈ రహదారులల్లోనే రోజూ రాకపోకలు సాగిస్తుంటారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏడాదిలోనే మండలంలో పలు రోడ్ల బాగుకు పాలకులు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో భాగంగా రామకుప్పం వైఎస్సార్ సర్కిల్ నుంచి కెంపసముద్రం మీదుగా, బందార్లపల్లె, బగళనత్తం మీదుగా వి.కోటకు వెళ్లే రహదారులతోపాటు పల్లెకుప్పానికి వెళ్లే రహదారి అభివృద్ధి పనులు నెల క్రితం చేపట్టారు. ఇప్పటికే బందార్లపల్లె, బగళనత్తం మీదుగా వి.కోట, రామకుప్పం పల్లెకుప్పం రహదారులకు కొత్తగా తారు వేసే పనులు పూర్తి కావొచ్చాయి. ఈ రోడ్ల అభివృద్ధిలో భాగంగా రామకుప్పం వైఎస్సార్ సర్కిల్ నుంచి సర్కిల్ అనుకుని ఉండే మలుపు, కెంపసముద్రం గ్రామం వద్ద గల మలుపులు, అదే సర్కిల్ వద్ద పల్లెకుప్పానికి వెళ్లే రహదారిలో, బందార్లపల్లె నుంచి బగళనత్తానికి వెళ్లే రహదారిలోని ఓ మలుపు వద్ద తారురోడ్డును తొలగించి గతంలో ఉన్న తారురోడ్డు కంటే ఎత్తుగా, వర్షపునీరు రోడ్డుపై నిల్వ ఉండకుండా సిమెంటు కాంక్రీటు రోడ్లు వేశారు. ఏళ్ల నాటి సమస్యలు తొలగడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. రహదారులు బాగుచేయించిన సీఎం చంద్రబాబు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తోపాటు మండల టీడీపీ నేతలకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

టీడీపీతోనే రైతుల కష్టాలు దూరం


రొంపిచెర్లలో ప్రజలతో
మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతుల కష్టాలు పరిష్కరించడంలో టీడీపీ ప్రభుత్వం ముమ్మర చర్యలు తీసుకుంటుందని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం పులిచెర్ల, సదుం, రొంపిచెర్ల మండలాలకు చెందిన పలువురు నాయకులు, రైతులు మామిడి కాయల అమ్మకాలు, ధరలపై తమగోడు విన్నవించారు. ఉద్యానశాఖ అధికారులతో సంప్రదించి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చల్లా బాబు వారికి హామీ ఇచ్చారు. పుంగనూరు పట్టణం పరిధిలోని నక్కబండ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని, తాగునీటి సౌకర్యం కోసం అదనపు బోరు వేయాలని, పైపులైన్, కల్వర్టులు నిర్మించాలని రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.శ్రీకాంత్ కోరారు. కార్యక్రమంలో రొంపిచెర్ల సర్పంచ్ ఆర్. ఇబ్రహీంఖాన్, రాష్ట్ర టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు రమణ, శంకర, శ్రీపతి, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి


పుస్తకాలు పంపిణీ చేస్తున్న వైస్ఎంపీపీ నూలురెడ్డెప్ప

రొంపిచెర్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని వైస్ ఎంపీపీ నూలు రెడ్డెప్ప అన్నారు. బుధవారం ఆయన పెద్దమల్లెల ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వం ఉచితంగా అందించే పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు, విశ్రాంత ఉపాధ్యాయుడు చిన్నరెడ్డెప్ప, హెచ్ఎం ఎర్రయ్య, ఉపాధ్యాయులు మనోహర్‌నాయుడు, రామకృష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాల్లో 213 మంది ఎంపిక


జాబ్‌మేళాకు హాజరైన విద్యార్థులు



మాట్లాడుతున్న కమిషనర్ మధుసూదన్‌రెడ్డి

శాంతిపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం తుమ్మిశిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళా విజయవంతమైంది. ఈ మేళాలో 160 మంది ఐటీఐ విద్యార్థులు పాల్గొనగా 126 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శేషారెడ్డి, శిక్షణాధికారి హితేంద్రకుమార్, సీఐటీడీ హైదరాబాదు శిక్షణాధికారి కళ్యాణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● **పుంగనూరు:** పుంగనూరు ఎంసీవీ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో 87 మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చాయని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం జరిగిన జాబ్‌మేళాలో 17 బహుళ జాతీయ కంపెనీలు పాల్గొన్నాయని.. మొత్తం 183 మంది హాజరుకాగా 87 మందిని ఎంపిక చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ స్కిల్ డెవలప్‌మెంట్‌ను పెంపొందించు కుంటూ మరిన్ని ఉన్నత అవకాశాలను పొందాలని సూచించారు. జిల్లా ఉపాధి అధికారి దోణప్ప, ప్రిన్సిపాల్ జి.రామకృష్ణ, ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి లోకేశ్, ఎన్‌టీవో పవన్‌కుమార్, హెచ్‌ఆర్ వేణు, రుపేష్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మామిడి రైతులకు ప్రభుత్వ సాయం


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సోమల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకుంటోందని సోమల ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు తెలిపారు. బుధవారం ఇరికిపెంట సచివాలయంలో మామిడి రైతులతో అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బెన్నురాజ్ మాట్లాడుతూ రైతులు మామిడి కాయలను విక్రయించే సమయంలో జ్యూస్ ఫ్యాక్టరీల వద్ద విధుల్లో ఉన్న అధికారులకు ఆధార్, 1-బి, బ్యాంకు పాసు పుస్తకం జిరాక్స్‌లు అందజేయాలన్నారు. రైతులు పక్వానికి వచ్చిన కాయలు మాత్రమే తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో నారాయణ, ఉద్యానశాఖ మంజు, ఆర్‌ఐ సుబుక్తుల్లా, కార్యదర్శి మేనక, నీటిసంఘ అధ్యక్షుడు బోస్, చంద్రశేఖర్‌నాయుడు, కోటీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు


కమ్మపల్లె ఆలయంలో ప్రత్యేక అలంకరణలో ఉత్సవర్లు

సోమల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మపల్లెలో కొలువుదీరిన లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం బ్రహ్మోత్సవాల నేపథ్యంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. వేదపండితులు శాస్త్రోక్తంగా హోమాలు చేపట్టారు. ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. రాత్రి ఆలయ ఆవరణలో పలు గ్రామాల భజన మండలి సభ్యులు చెక్క భజన, కోలాటాలతో కోలాహలంగా పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పుంగనూరు రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె మండలం లద్దిగం గ్రామానికి చెందిన వేణుగోపాల్‌రెడ్డి సొంత పనులపై పుంగనూరు మండలం సుగాలిమిట్ట వద్ద రోడ్డుపై నడిచి వెళుతుండగా అనంతపురం జిల్లా కదిరి నిజాంకాలనీకి చెందిన మహబూబ్‌బాషా పుంగనూరు నుంచి మదనపల్లె వైపు ద్విచక్రవాహనంలో వెళుతూ రోడ్డుపై నడిచి వెళుతున్న వేణుగోపాల్‌రెడ్డిని ఢీకొన్నాడు. గాయపడిన వేణుగోపాల్‌రెడ్డిని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. కాలు విరగడంతో మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వైసీపీ ఎస్టీసెల్ రాష్ట్ర సహ కార్యదర్శిగా నాగరాజు



పలమనేరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మున్సిపల్ కౌన్సిలర్ నాగరాజు వైసీపీ అనుబంధ విభాగం ఎస్టీసెల్ రాష్ట్ర సహకార్యదర్శిగా నియమితులయ్యారు. ఆమేరకు ఆయనకు పార్టీ కేంద్ర కార్యాలయం నియామకపు ఉత్తర్వులు పంపింది. గిరిజనుల సంక్షేమానికి, పార్టీ బలోపేతానికి తాను కృషిచేస్తానని, తనకు అవకాశం కల్పించిన వైసీపీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

గోసంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం


రసీదును అందిస్తున్న ఏఈవో రవీంద్రబాబు

ఐరాల(కాణిపాకం), జూన్ 18(ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గో సంరక్షణ ట్రస్టుకు బుధవారం తిరుపతికి చెందిన పంచజయన్ రూ.1,00,116 విరాళంగా అందించారు. విరాళదాతకు ఏఈవో రవీంద్రబాబు స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. సూపరింటెండెంట్ కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో ప్రముఖులు

కాణిపాక వరసిద్ధుడిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. స్వామిని దర్శించుకున్న వారిలో రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, ప్రముఖ సినీ నిర్మాత అంబికా కృష్ణ ఉన్నారు. వీరు స్వామిని విడివిడిగా దర్శించుకున్నారు. వారిని సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్లు రవి, బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పక్వానికి వచ్చిన తోతాపురినే కోయండి


తిమ్మోజిపల్లె వద్ద ఉన్న
ర్యాంపులను పరిశీలిస్తున్న భవానీ

బంగారుపాళ్యం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులు పక్వానికి వచ్చిన తోతాపురి మామిడినే కోయాలని పలమనేరు ఆర్డీవో భవానీ సూచించారు. బుధవారం బంగారుపాళ్యం సచివాలయంలో రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆగస్టు చివరి వరకు రైతుల నుంచి మామిడి కొనుగోలు చేస్తారని, రైతులు ఇబ్బందిపడాల్సిన పనిలేదన్నారు. అనంతరం తిమ్మోజిపల్లె వద్ద గల ర్యాంప్‌ను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో తహశీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్, ఏవో భారతి, మాజీ సర్పంచు కృష్ణమూర్తి, అధికారులు పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

బోరు వేశారు...
విద్యుత్ కనెక్షన్ మరిచారు


బోరు వేసి విద్యుత్ కనెక్షన్ ఇవ్వని అధికారులు

యాదమరి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశిరాళ్ల పంచాయతీ పెరుమాళ్లపెంట గ్రామంలో తాగునీటి సౌకర్యం కోసం బోరు వేశారు కానీ విద్యుత్ సౌకర్యం కల్పించకుండా వదిలేశారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి దాహార్తిని తీర్చేందుకు అధికారులు గ్రామంలో మూడునెలల క్రితం మంచినీటి బోరుబావి తవ్వగా నీరుపడ్డాయి. అయితే బోరుకు పైపులు, మోటరు బిగించి విద్యుత్ కనెక్షన్ ఇవ్వకుండా అలాగే వదిలేశారు. సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. విద్యుత్ కనెక్షన్ మంజూరు కాకపోవడం వలన ఆలస్యమైందని, త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉషారాణి తెలిపారు.

మా పాఠశాలను మార్చకండి సారూ...!


పాఠశాలను మార్చరాదంటూ విద్యార్థుల నిరసన

చిత్తూరు సెంట్రల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మా పాఠశాలను మార్చకండి సారూ అంటూ చిత్తూరు నగరంలోని 11వ డివిజన్ ఎల్బీపురం హరిజనవాడ విద్యార్థులు, తల్లిదండ్రులు బుధవారం పాఠశాల ముందు నిరసన చేపట్టారు. 15 మంది ఉన్న తమ పాఠశాలను సమీపంలోని ఎల్బీపురంలో కేవలం ముగ్గురు విద్యార్థులున్న పాఠశాలలో విలీనం చేయడం ఎంత వరకు సరైనదని ప్రశ్నిస్తున్నారు. ఇక్కడినుంచి ఆ పాఠశాలకు వెళ్లాలంటే రైల్వేగేటు దాటాల్సి ఉందని, రోడ్డు ప్రమాదాలు సైతం ఎక్కువగా జరుగుతుంటాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలను దృష్టిలో ఉంచుకుని పాఠశాలను మార్చరాదంటూ అధికారులకు గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పాఠశాల వద్ద విద్యార్థుల నిరసన


పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు

శ్రీరంగరాజపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలోని పాఠశాలను మరో పాఠశాలలో విలీనం చేయొద్దని ఎస్‌ఆర్‌పురం మండలం పెద్ద తయ్యూరు పాఠశాల వద్ద బుధవారం విద్యార్థులు, తల్లిదండ్రులు నిరసన వ్యక్తం చేశారు. తయ్యూరు ప్రాథమిక పాఠశాలలో సుమారు 25మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ పాఠశాలను సుమారు 2 కిలోమీటర్ల దూరంలోని బసివిరెడ్డిపల్లెలోని ప్రాథమిక పాఠశాలలో విలీనం చేయాలని అధికారులు నిర్ణయించారు. దీంతో గ్రామస్తులు తమ పిల్లలను అక్కడకు పంపలేమని వాపోయారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్టీసీ డ్రైవర్ కుటుంబానికి పరామర్శ


బాధితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న థామస్

గంగాధరనెల్లూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మీ కుటుంబానికి అండగా ఉంటుందని ప్రభుత్వ విప్ డాక్టర్ వి.ఎం.థామస్ భరోసా ఇచ్చారు. గంగాధరనెల్లూరు మండలం తూగుండ్రం గ్రామానికి చెందిన టీడీపీ మాజీ మండల ఉపాధ్యక్షుడు కుమారుడు ఆర్టీసీ డ్రైవర్ లక్ష్మి కరుణ కుమార్‌రెడ్డి అలియాస్ డ్రైవర్ కర్ణ ఈనెల కర్ణాటక రాష్ట్రం హోస్కోట వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో తీవ్రగాయాలకు గురై, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించిన విషయం తెలిసిందే. బుధవారం తూగుండ్రంలో ఆయన కుటుంబసభ్యుల్ని టీడీపీనేతలతో కలిసి థామస్ పరామర్శించారు. వారి కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈకార్యక్రమంలో టీడీపీనేతలు ఎర్రగుంట్ల కృష్ణమ నాయుడు, శ్రీధర్‌యాదవ్, స్వామిదాస్, నరసింహులు నాయుడు, నియాజ్‌అలీ, బాబు నాయుడు, మోహన్ నాయుడు, నీరజాక్షులురెడ్డి, అశోక్ నాయుడు, హరీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

● శ్రీరంగరాజపురం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం హోస్కోటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇటీవల మరణించిన టీడీపీనేత రమేష్ కుమార్తె తులసి కుటుంబ సభ్యులను బుధవారం రాత్రి ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ పరామర్శించారు. ఆ కుటుంబానికి టీడీపీ ప్రభుత్వ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పుల్లూరు బాబు, పవన్, పుల్లూరు దాము, వెంకటాచాలం బాలాజీ నాయుడు, భాస్కర్ నాయుడు, నిరంజన్‌రెడ్డి, ఎస్.కుమార్, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రసాయన రంగునీటిని అరికట్టండి


ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న అఖిలపక్ష నాయకులు

నగరి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రసాయన రంగునీటి కారణంగా నదులు, చెరువులు, కాలువలు, తాగు, సాగునీరు కలుషితమై పలువురు రోగాల బారిన పడుతున్నారని నగరి ఆర్డీవో భవానిశంకరికి బుధవారం అఖిలపక్ష నాయకులు వినతిపత్రం అందించారు. రసాయన రంగునీటి కారణంగా పట్టణ, గ్రామాల ప్రజలు పడుతున్న అవస్థల గురించి వారు వివరించారు. రంగునీటిని బయటకు విడుదల చేస్తున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకునేలా పొల్యూషన్‌బోర్డు వారితో చర్చిస్తానని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రమేష్ నాయుడు, పొన్నుస్వామి ఈశ్వర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మా భూమిని సర్వే చేయించండి


మీడియాతో మాట్లాడుతున్న అనంత

చిత్తూరు సిటీ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): తమ భూమిని సర్వే చేసి ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని బంగారుపాళ్యం మండలం, బలిజపల్లికి చెందిన అనంత కోరారు. బుధవారం చిత్తూరు ప్రెస్ క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ తనకు ఒక తమ్ముడు ఉన్నాడని, మొగిలివారి పంచాయతీలో సర్వే నెంబర్ 270లో తమకు 2.77 ఎకరాల భూమి ఉందన్నారు. ఈ భూమిలో తనకు, తన తమ్ముడికి భాగపరిష్కారమైందని చెప్పారు. తన తమ్ముడికి చెందిన కొంత భూమిని నాలుగు సంవత్సరాల క్రితం రియల్‌ఎస్టేట్ వ్యాపారులకు విక్రయించాడని చెప్పారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు తన భూమిని కూడా ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తమ భూమిలోని మామిడి చెట్లను సైతం నరికివేస్తూ ప్రశ్నించినందుకు తమపై దౌర్జన్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు సంవత్సరాలుగా తమ భూమిని సర్వే చేయాలని రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నానని, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల వేదికలో కలెక్టర్‌కు విన్నవించుకుంటున్నా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి తమ భూమిని కాపాడాలని ఆయన కోరారు.

పోక్సో కేసులో ఒకరికి రిమాండు

పెనుమూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామంలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో బుధవారం డీఎస్పీ విచారణ చేపట్టారు. అనంతరం చిత్తూరు మొబైల్ కోర్టులో నిందితుడిని మహిళా జడ్జి విచారించి, 14 రోజులు రిమాండు విధించినట్లు ఏఎస్ఐ మనోహర్ తెలిపారు.

చిత్తూరు రూరల్ తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

చిత్తూరు రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండల తహసీల్దార్‌గా జయప్రకాష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న లోకేశ్వరి ఐరాల తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. నదుం తహసీల్దార్ జయప్రకాష్‌ను చిత్తూరు రూరల్ మండల తహసీల్దార్‌గా నియమించారు. పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

గో సంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం


రసీదును అందిస్తున్న ఏఈవో రవీంద్రబాబు

ఐరాల(కాణిపాకం), జూన్ 18(ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గో సంరక్షణ ట్రస్టుకు బుధవారం తిరుపతికి చెందిన పంచజయన్ రూ.1,00,116 విరాళంగా అందించారు. విరాళ దాతకు ఏఈవో రవీంద్రబాబు స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. సూపరింటెండెంట్ కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో పలువురు ప్రముఖులు

కాణిపాక వరసిద్ధుడిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. స్వామిని దర్శించుకున్న వారిలో రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, ప్రముఖ సినీ నిర్మాత అంబికా కృష్ణ ఉన్నారు. వీరు స్వామిని విడివిడిగా దర్శించుకున్నారు. వారిని సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్లు రవి, బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈగా గిరీష్‌కుమార్

విజయపురం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈగా గిరీష్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపీడీవో రాజేంద్ర తెలిపారు. కార్వేటినగరం ఏఈఈగా విధులు నిర్వహిస్తూ బదిలీపై విజయపురం వచ్చినట్లు చెప్పారు. గిరీష్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థులకు భోజనప్లేట్లు, గ్లాసుల వితరణ



నగరి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణంలోని ఎంపీపీ బాలికల పాఠశాలలో టీడీపీ నేత రాజశేఖర్ వితరణతో విద్యార్థులకు భోజనప్లేట్లు, గ్లాసులను బుధవారం ఎంఈవో శ్రీదేవి సమక్షంలో పంపిణీ చేశారు. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ జన్మదినాన్ని పురస్కరించుకుని ముందుగానే పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు వితరణ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుణశేఖర్, జ్యోతి నాయుడు, కుప్పయ్యశెట్టి, లోకేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

సికిల్ సెల్ అనీమియాపై అవగాహన కల్పించండి

చిత్తూరు రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): సికిల్ సెల్ అనీమియాపై జిల్లాలో విరివిగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని డీఎంహెచ్‌వో సుధారాణి అధికారులను ఆదేశించింది. బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో సికిల్ సెల్ అనీమియా వ్యాధికి సంబంధించి గోడపత్రికలను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ 2047 నాటికి జిల్లాలో ఈ వ్యాధిని రూపుమాపాలని సూచించారు. అందుకోసం విరివిగా ఈ వ్యాధిపై అవగాహన, రక్తపరీక్షలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సౌందర్యలహరి సామూహిక పారాయణం

చిత్తూరు కల్చరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీనగర్ కాలనీలో బుధవారం సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో బాబా భక్తురాలు సుధాకృష్ణమూర్తి నివాసంలో బాబా సౌందర్యలహరి సామూహిక పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సమితి మహిళా సభ్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి భజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పూరిల్లు దగ్ధం


దగ్ధమైన పూరింటిని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

విజయపురం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): షార్టు సర్క్యూట్‌కు పూరిల్లు దగ్ధమై రూ.40 వేలు ఆస్తి నష్టం జరిగిన సంఘటన విజయపురంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు... ఇంద్రాణి అంధురాలు. ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉన్నట్టుండి షార్టు సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో ఇంట్లో ఉన్న బట్టలు, సామగ్రి, ఆహారధాన్యాలు, కొంత నగదు పూర్తిగా కాలిపోయాయని కన్నీరు మున్నీరుగా విలపించారు. కట్టుబట్టలతో వీధిన పడ్డానని కంటతడి పెట్టారు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ కిరణ్, ఆర్ఐ మార్కండేయులు, వీఆర్వో మేఘనాథం సంఘటనా స్థలాన్ని పరిశీలించి, జరిగిన నష్టాన్ని అంచనా వేసినట్టు తెలిపారు. అగ్నిమాపక యంత్రం ద్వారా మంటలు ఆర్పడానికి ప్రయత్నం చేసేలోపే నష్టం జరిగిపోయిందన్నారు. ప్రభుత్వం సహాయం అందేలా చర్యలు తీసుకుంటానని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచండి

పాలసముద్రం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీవో సతీష్ ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోజుకు 800మంది కంటే తక్కువగా కూలీలు పనిచేయడం వలన జిల్లాలో పాలసముద్రం మండలం వెనుకంజలో ఉందన్నారు. కూలీల సంఖ్య పెంచకపోతే ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏపీవో మార్గరెట్, ఈసీ రామ్మూర్తి, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

నియోజకవర్గ పరిశీలకుడిగా బొమ్మి సురేంద్ర

వెదురుకుప్పం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకులుగా బొమ్మి సురేంద్రను నియమించారు. పార్టీ ఎన్నికల నియోజకవర్గ పరిశీలకులుగా జంబాపురం రమణారెడ్డి, రెడ్డివారి గురవారెడ్డిని నియమించారు. మండలాల పరిశీలకులుగా ఎన్‌పీ జయప్రకాష్(గంగాధరనెల్లూరు), డాక్టర్ సప్తగిరిప్రసాద్(కార్వేటినగరం), కోదండయాదవ్(పాలసముద్రం), గంజి మాధవయ్య(పెనుమూరు), కఠారి హేమలత(ఎస్‌ఆర్‌పురం), ఎం.సురేంద్రబాబు(వెదురుకుప్పం)ను పార్టీ అధిష్ఠానం నియమించింది.

సబ్సిడీపై పశువుల దాణా పంపిణీ

పూతలపట్టు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలువురు పాడిరైతులకు సబ్సిడీపై పశువుల దాణాను బుధవారం పూతలపట్టు పశువుల ఆస్పత్రిలో పంపిణీ చేశారు. రూ.1100 విలువచేసే బ్యాగును 50శాతం సబ్సిడీపై రూ.550కే పాడిరైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేత గుంటూరు మురళి, మాజీ కన్వీనర్ ప్రతాపనేని చంద్రమౌళి, పశువైద్యాధికారి డాక్టర్ విజయ్‌మోహన్, పాడిరైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు ఆర్థికంగా ఎదగడమే ప్రభుత్వ లక్ష్యం

● ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్


రైతులకు చెక్కు అందచేస్తున్న థామస్, చిత్తూరు మేయర్ అముద

గంగాధరనెల్లూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆర్థికంగా ఎదగడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ థామస్ అన్నారు. వ్యవసాయశాఖ తరఫున పలువురు రైతులకు సబ్సిడీపై మంజూరైన రూ.40.42లక్షలు విలువ చేసే మడకలు, పవర్ ఫీడర్స్, బ్యాటరీసేవర్స్, రొటోవేటర్లను బుధవారం గంగాధరనెల్లూరు ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో థామస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని రైతులకు అవసరమైనన్ని విత్తనబస్తాలను త్వరలోనే అందజేస్తామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం వైసీపీ నేతల ముసుగులో రైతు గ్రూపులను ఏర్పాటుచేసి సబ్సిడీ పరికరాలు తీసుకున్నారని, అర్హులైన రైతులకు ఇచ్చిన పాపానపోలేదని విమర్శించారు. రైతులకు రాయితీపై వచ్చిన నగదును థామస్ చెక్కు రూపంలో అందజేశారు. అనంతరం మండలంలోని ముక్కళత్తూరు నుంచి ముస్తిపల్లె వరకు కొత్తగా రూ.80లక్షలతో తారురోడ్డు నిర్మాణానికి గాను శంకుస్థాపన శిలాఫలాకాన్ని థామస్ ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో చిత్తూరు నగర కార్పొరేషన్ మేయర్ అముద, పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, నగరి వ్యవసాయశాఖ ఇన్‌చార్జి ఏడీఏ రజని, ఎంపీడీవో కృష్ణమహేష్‌రెడ్డి, మండల ఏవో భవాని, టీడీపీ నేతలు శ్రీధర్‌యాదవ్, స్వామిదాస్, దేవసుందరం, ప్రభాకర్‌నాయుడు, చంద్రానాయుడు, జాన్, చిన్నా, ఏవోలు తదితరులు పాల్గొన్నారు.

పక్వానికి వచ్చిన తోతాపురినే కోయండి: ఆర్డీవో


తిమ్మోజుపల్లె వద్ద ఉన్న ర్యాంపులను పరిశీలిస్తున్న ఆర్డీవో భవాని

బంగారుపాళ్యం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులు పక్వానికి వచ్చిన తోతాపురి మామిడినే కోయాలని పలమనేరు ఆర్డీవో భవాని సూచించారు. బుధవారం బంగారుపాళ్యం సచివాలయంలో రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆగస్టు చివరి వరకు రైతుల నుంచి మామిడి కొనుగోలు చేస్తారని, రైతులు ఇబ్బందిపడాల్సిన పనిలేదన్నారు. ప్రభుత్వం అందించే సబ్సిడీ రూ.4లను రైతుల ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందని, రైతులు పట్టాపుస్తకం, బ్యాంక్ అకౌంట్ బుక్, ఆధార్ కార్డు జిరాక్సులను సంబంధిత అధికారులకు అందజేయాలని ఆమె సూచించారు. అనంతరం తిమ్మోజుపల్లె వద్ద గల ర్యాంప్‌ను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో తహశీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్, ఏవో భారతి, మాజీ సర్పంచు కృష్ణమూర్తి, అధికారులు పాల్గొన్నారు.

మామిడి పంట కోతపై అవగాహన

పెనుమూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) మామిడి రైతులు తాము పండించిన పంటను ఒకేసారి కోతకోసి ఫ్యాక్టరీల వద్దకు వెళ్లి ఇబ్బందులు పడకూడదని ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఎంఈవో భాస్కర్ నాయుడు సూచించారు. బుధవారం శాతంబాకం ఎంపీపీ స్కూల్‌లో రైతులకు మామిడి పంటపై అవగాహన కల్పించారు. పక్వానికి వచ్చిన మామిడి కాయలనే ముందుగా కోసి ఫ్యాక్టరీలకు తీసుకెళ్లాలని తెలిపారు. అగ్రికల్చర్ వీహెచ్‌వో సంధ్య, రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి


నిరసనగా వస్తున్న ఇంజనీరింగ్ విభాగం కార్మికులు

చిత్తూరు అర్బన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని ఇంజనీరింగ్ కార్మికులకు హెచ్‌ఆర్ పాలసీని వర్తింపచేయడంతో పాటు ఉద్యోగ భద్రతను కల్పించాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శరవణ, ప్రధాన కార్యదర్శి శివకుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు, సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని ఆరోపిస్తూ బుధవారం కార్మికులు నగర పాలక కార్యాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి, అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందించారు. వారు మాట్లాడుతూ కార్మికుల జీతాలను పెంచకపోతే ఈ నెల 22వ తేదీ తరువాత నీటిసరఫరాను నిలిపేయడంతో పాటు వీధి దీపాలను ఆపేసి పూర్తిస్థాయిలో సమ్మెలోకి వెళతామని హెచ్చరించారు. స్కిల్డ్ వర్కర్లకు రూ.29,200, అన్‌స్కిల్డ్ వర్కర్లకు రూ.24,600 చొప్పున వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నేతలు శివప్రసాద్, వెంకటేశ్, దియా, సునీల్‌కుమార్, గోపాలాచారి, పీరుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీలను త్వరితగతిన పరిష్కరించండి


క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి బిల్లు చెల్లించే విధానాన్ని చూపుతున్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర కోరారు. బుధవారం స్థానిక గాంధీ రోడ్డులోని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ విద్యుత్ కార్యాలయంలో ఆ శాఖ గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు వినియోగాదారులు కార్యాలయం వరకు రావాల్సిన అవసరం లేదని, బిల్లులోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం ఇతర యూపీఐ యాప్‌ల ద్వారా చెల్లించవచ్చునన్నారు. అనంతరం బిల్లు చెల్లించేందుకు వచ్చిన ఓ వినియోగదారుడికి బిల్లులోని క్యూఆర్ కోడ్ ఎలా స్కాన్ చేసి చెల్లించాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 2 అర్జీలు రాగా ఒకదాన్ని అప్పటికప్పుడే పరిష్కరించారు. టౌన్ డీఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులిచ్చిన పట్టాను రద్దుచేయండి


దారి సమస్యపై రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న కూటంవారిపల్లె గ్రామస్తులు

పూతలపట్టు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): దేవుడి మాన్యం భూమికి సంబంధించిన స్థలానికి ఇచ్చిన పట్టాను రద్దుచేయాలని కూటంవారిపల్లె గ్రామస్తులు బుధవారం రెవెన్యూ అధికారులను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేనూతనపల్లి సమీపాన గల వీరభద్రస్వామి ఆలయానికి సంబంధించిన భూమిని అక్రమంగా వైసీపీకి చెందిన ఓ సర్పంచ్ భార్య 2023వ సంవత్సరంలో గ్రామస్తులకు తెలియకుండా తన పేరిట డీకేటీ పట్టా తెచ్చుకున్నారని చెప్పారు. గుడికి సంబంధించిన ఈ భూమిపై ఎవరికీ ఎలాంటి హక్కు లేదని, ఇచ్చిన డీకేటీ పట్టాను రద్దుచేయాలని కూటంవారిపల్లె రైతులు రెవెన్యూ సిబ్బందికి వినతిపత్రం సమర్పించారు. దీనిపై సచివాలయ సర్వేయర్లు వీరభద్రస్వామి ఆలయ భూమి వద్దకు చేరుకొని కొలతలు వేయగా, ఇచ్చిన పత్రాలను రద్దుచేయాలని వారు రెవెన్యూ సిబ్బందిని డిమాండ్ చేశారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం



వెదురుకుప్పం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం దాతలు అన్నదానం చేశారు. శ్రీకాళహస్తికి చెందిన దాతలు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ


పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న టీడీపీ నేత

వెదురుకుప్పం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని రాజాకుమారరాజా గవర్నమెంటు హైస్కూల్‌లో బుధవారం పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, టీడీపీ నాయకులు షేక్ సందాని, హెచ్‌ఎం కోటేశ్వరరావు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు.

'తల్లికి వందనం' పేరుతో దగా

- మాజీ డిప్యూటీ సీఎం

వెదురుకుప్పం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పేరుతో ఏపీ సీఎం చంద్రబాబు తల్లులకు ఎగనామం పెట్టారని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి విమర్శించారు. బుధవారం కార్వేటినగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో తల్లికి వందనం పథకానికి 84 లక్షల మంది అర్హులు ఉంటే 54 లక్షల మందిని మాత్రమే అర్హులుగా డబ్బులు వేశారని, మిగతా 30 లక్షల మందికి ఎందుకు డబ్బులు వేయలేదని ప్రశ్నించారు. చంద్రబాబు పాలనలపై విమర్శలు గుప్పించారు.

బస్సు సర్వీసును పునరుద్ధరించండి ప్లీజ్


వేరే బస్సు ఎక్కుతూ.. బస్సు సర్వీసును పునరుద్ధరించాలంటున్న ప్రయాణికులు

వెదురుకుప్పం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): బస్సు సర్వీసును పునరుద్ధరించం డి ప్లీజ్ అంటూ వెదురుకుప్పం మండలం అగ్గిచేనుపల్లికి చెందిన ప్రజలు అంటున్నారు. పుత్తూరు డిపో నుంచి వచ్చే అగ్గిచేనుపల్లె సర్వీసు కొంతకాలంగా ఆగిపోయిందని తెలిపారు. దీంతో ఆ మార్గంలో వెళ్లే ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారని, వెంటనే ప్రజాప్రతినిధులు స్పందించి బస్సు సర్వీసును పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.

సంతానం కోసం ఉచిత చికిత్స శిబిరం


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ ఐశ్వర్య

యాదమరి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోడిచింతల వద్ద సంతానం లేనివారికి ఉచిత చికిత్స శిబిరం నిర్వహించారు. బుధవారం సుచి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు పాల్ విజయ్‌కుమార్, గ్లోరీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో వేలూరు సారల్ ఫెర్టిలిటీ సెంటర్ డాక్టర్ ఐశ్వర్య ఆధ్వర్యంలో సంతానం లేని భార్యాభర్తలకు కౌన్సెలింగ్ ఇచ్చి, పరీక్షలు నిర్వహించి సారల్ ఫెర్టిలిటీ సెంటర్‌కు రెఫర్ చేసినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఐశ్వర్య, డాక్టర్ విఘ్నేష్, సుచి సిబ్బంది శాంసన్, ఆనంద్‌కుమార్, ధనలక్ష్మి, వరదరాజులు, జాకబ్ జాన్సన్, డి.చిన్నయ్య పాల్గొన్నారు.

అక్రమ క్వారీలను రద్దు చేయండి: సీపీఐ

నగరి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నగరి మండలం, పట్టణ పరిధిలో గల అక్రమ క్వారీలను రద్దు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. నగరి తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, నగరి నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్యల సమక్షంలో నిరసన వ్యక్తం చేసి తహశీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందించారు. కొండలు, క్వారీలు వున్న పరిసర ప్రాంతాల గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, గ్రామస్తుల అభిప్రాయాలను సేకరించిన అనంతరం క్వారీలకు అనుమతులివ్వాలని చెప్పారు. అలా కాకుండా ఎవరైనా క్వారీలు, క్రషర్లు నడుపుతుంటే వాటిని రద్దు చేయాలని కోరారు. సీపీఐ నాయకులు నాగరాజు, వేలన్‌బాషా, విజయకుమార్, రజనీ, సందీప్, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంత

● మురుగు నీటితో కంపుకొడుతున్న పరిసరాలు



డ్రైనేజీ నిండిపోయి దుర్గంధం వెదజల్లుతున్న మురుగునీరు

చిత్తూరు సిటీ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై ఏర్పడిన గుంత కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆ పక్కనే డ్రైనేజీ నిండిపోవడంతో సమీపంలోని ప్రజలు దుర్గంధం భరించలేకున్నారు. స్థానిక కట్టమంచి మలుపు వద్ద రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడింది. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా కట్టమంచి నుంచి నగరంలోనికి భారీ వాహనాలను అనుమతించరు. కాగా తిరుపతి వైపు నుంచి పుత్తూరుకు, పుత్తూరు నుంచి తిరుపతి వైపువెళ్లే భారీ వాహనాలు కట్టమంచి మలుపువద్ద తిరుగుతుంటాయి. ఈ మార్గంలో రోడ్డుపై ఏర్పడిన గుంత కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ గుంతలో ద్విచక్ర వాహనాలు దిగడంవల్ల పలువురు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగినపుడు అధికారులు గుంతలో మట్టివేసి చేతులు దులుపుకుంటున్నారు. ఈ మట్టి వర్షంపడితే కొట్టుకుపోతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తారు కంకరతో గాని, సిమెంటు కాంక్రీటుతో గానీ గుంతను పూడ్చి ప్రమాదాలు నివారించాలని స్థానికులు కోరుతున్నారు. ఇదే గుంత పక్కనే ఉన్న డ్రైనేజి నిండిపోయి వారాలు గడుస్తున్నా సంబంధిత శాఖ అధికారులు స్పందించడంలేదు. డ్రైనేజీ పక్కనే దుకాణాలు, నివాస స్థలాలు ఉండటంతో డ్రైనేజీ నుంచి దుర్గంధం వెదజల్లుతోంది. డ్రైనేజీ దోమలకు ఆవాసంగా మారడంతో పరిసర ప్రాంత ప్రజలు దోమకాటుకు గురై అనారోగ్యాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై గుంతను పూడ్చి, డ్రైనేజీని శుభ్రపరచాలని స్థానికులు కోరుతున్నారు.